

బిక్కవోలు ఘటనలపై విచారణకు ఆదేశం

అనపర్తి,ఫిబ్రవరి 14 : బిక్కవోలు మండలంలో ఇటీవల ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ స్పందించింది. విచారణ నిర్వహించి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్వర్తులు జారీ చేసినట్టు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. బదిలీపై వెళ్లినా తిరిగొచ్చి 120 ఇళ్ల పట్టాలపై సంతకాలు చేసిన తహశీల్దార్ పోసిబాబు, మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధుల భర్తలు చేసిన రాజకీయ ప్రసంగాలపైన, ఇళ్ల పట్టాలు పంపిణీకి సొమ్ములు వసూలు చేసిన శానిటరీ సూపర్‌వైజర్‌పైన చర్యలు కోరుతూ చేసిన ఫిర్యాదులపై స్పందించినట్టు తెలిపారు.

రేపు బంద్ విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 : కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న ప్రధాని మోదీ విధానాలను తిప్పికొట్టేందుకే ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఐదు వందల రైతు సంఘాలతో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చా, మధ్యతరగతి ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఈ నెల 16న బంద్ విజయవంతం చేయాలన్నారు. రాజమహేంద్రవరంలోని గణేష్‌చౌక్ రైతు బజార్, ఆజాద్‌చౌక్, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో బుధవారం కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు రూ. 5 లక్షల కోట్లు అప్పనంగా దోచిపెట్టారని, కార్మికులు, ప్రజలు, ఉద్యోగులు, రైతుల పట్ల తీవ్ర నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికే 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, నాయకులు రాంబాబు, అప్పల నరసయ్య వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు సప్పా రమణ, నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3న పల్స్ పోలియో : డీఎంహెచ్‌వో



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 : జిల్లాను పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం అని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు.రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై బుధవారం వైద్యాధికారులు, వైద్యసిబ్బందితో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 1,88,772 మంది ఉన్నారని, వీరందరికీ పోలియో వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. వ్యాక్సిన్ వేయడానికి 4,657 మంది ఆరోగ్యసిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మెంబర్ డాక్టర్ జాన్ జ్యుడే జోసఫ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఎన్.రాజకుమారి పాల్గొన్నారు.



కోరుకొండలో ఆందోళన చేస్తున్న రైతాంగం

కోరుకొండలో రిజిస్ట్రేషన్ల నిలుపుదలపై ధర్నా

కోరుకొండ, ఫిబ్రవరి 14 : కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఈనం భూములంటూ కోరుకొండకు చెందిన భూములు, ఇళ్లస్థలాలు, ఇళ్ళు గత ఎనిమిదేళ్లుగా క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంపై రైతులు మండిపడ్డారు.వెంటనే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం కోరుకొండ, రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన ధర్నా చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో భూముల రిజిస్ట్రేషన్లకు ఆర్డినెన్స్ తీసుకొచ్చారని అది చట్టరూపం దాల్చేలోపు ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం రావడం జరిగాయన్నారు. ప్రస్తుత వైసీపీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే కోరుకొండ భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించి ఓట్లు అడుగుతామన్నారని.. నాలుగున్నరేళ్లు గడచిపోయినా రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించలేదన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా కోరుకొండలో రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రొంగల శ్రీనివాస్, ఉండ్రు రామారావు చౌదరి, మద్దాల రమణ, పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్

జగనన్న ఇళ్లు ఒక బోగస్

వెలుగుబందలో నిర్మాణాల్లేవ్.. ఆవలో ఇళ్లే లేవు..

టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ - నేడు ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: జగనన్న ఇళ్లు ఒక బోగస్ స్కీమ్‌గా తయారైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలుగుబందలో జగనన్న ఇళ్ల పథకంలో 13069 ప్లాట్లు వేస్తున్నట్టు లెక్కలు కట్టారని అందులో 10,081 ప్లాట్లు ఇస్తే నివాసయోగ్యంకాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చివరికి అక్కడ కేవలం 100 మంది మాత్రమే శ్లాబులు వేసుకున్నారని చెప్పారు. జగనన్న ఇళ్ల స్కీమ్ పేరుతో రూ. లక్షా 80 వేలు మాత్రమే కేటాయించి మిగిలినవి లబ్ధిదారులు పెట్టుకుని త్వరగా ఇల్లు పూర్తి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇల్లు పూర్తి కావాలంటే రూ.10లక్షలు ఖర్చవుతుందన్నారు. ఇల్లు పూర్తి చేసుకోకపోతే సంక్షేమ పథకాలు కట్ చేస్తామని బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. దీనిపై నా దృష్టికి వస్తే కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఇక బూరుగుపూడి ఆవలో తాడిచెట్టులోతులో ఉన్న నీటిలో ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయింపులు చేశారని చెప్పారు. కోర్టు అనుమతించినా ఇప్పటికి ఒక ఇల్లు కూడా కట్టలేదన్నారు. 25 శాతం కమీషన్ కోసం ఎంపీ ఆవ భూములు కేటాయించారని ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు ధర్నా చేస్తున్నట్టు ప్రకటించారు. సమావేశంలో జనసేన నగర అధ్యక్షుడు వై . శ్రీను, టీడీపీ మాజీ కార్పొరేటర్లు యిన్నమూరి రాంబాబు, మొకమాటి సత్యనారాయణ, కోరుమిల్లి విజయశేఖర్, ద్వారా పార్వతి సుందరి, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు,నల్లం శ్రీను, రొబ్బి విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంపింది పులా? పిల్లా!?

- 20 కోళ్ల పీకలు కొరికి రక్తం తాగిన జంతువు
- వైల్డ్ క్యాట్ దాడిచేసిందంటున్న అధికారులు
- చీపురుగూడెంలో ఘటన



నల్లజర్ల,ఫిబ్రవరి 14 : గుర్తు తెలియని జంతువుల దాడిలో 12 పందెం పుంజులు,8 కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి.నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన పిన్నమని దుర్గారావు చీపురుగూడెంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని నాటు కోళ్ళ పెంపకం ప్రారంభించాడు. చుట్టు నెట్ కట్టి అందులో 50 కోళ్ల వరకు పెంచుతున్నాడు. ప్రతి రోజూ రాత్రి సమయంలో కోళ్లను చూసుకుని వెళ్లే అలవాటు ఉన్న రైతు దుర్గారావు మంగళవారం రాత్రి 11 గంటలకు కోళ్ళ వద్దకు వెళ్లి చూడగా కొన్ని కొన ఊపిరితో కొట్టుకుంటున్నాయి.కొన్ని కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఇటీవల ఇక్కడి నుంచి వెళ్లిపోయిన పులి మళ్లీ వచ్చి ఉంటుందని కంగారుపడిన రైతులు ఫారెస్ట్ అధికారులకు ఫోన్ సమాచా రం అందించారు. ఈ మేరకు బుధవారం ఉదయం చీపురుగూడెం వచ్చిన ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్ వారి సిబ్బంది పాదముద్రలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పాదముద్రలు పులి,చిరుత పులివి కావని నిర్ధారణకు వచ్చి అడవి జంతువులు కోళ్ళపై దాడి చేయలేదని చెప్పారు.పశు వైద్య శాఖ ఏడీఏ మోజేష్ తన బృందంతో మృతిచెందిన కోళ్ళను పరిశీలించారు. కేవలం తలపై మాత్రమే దాడి చేసి రక్తం పీల్చి ఉండడంతో పొలంలో ఉన్న పెద్ద సైజు జంగు పిల్లులు,బావుర పిల్లులు (వైల్డ్ క్యాట్) వంటి జాతులు మాత్రమే రక్తం పీల్చి చంపి ఉంటాయని అంచనా వేశారు. 20 కోళ్ల మృత్యువాత పడడం ద్వారా సుమారు 3 లక్షల నష్టం వచ్చినట్టు రైతు దుర్గారావు తెలిపాడు. రెండు పందెం పుంజులు (డాబర్)రెండు లక్షలు విలువ ఉంటుందన్నారు.మొన్నటి వరకు చీపురుగూడెం ఫారెస్ట్‌లో పెద్ద పులి సంచరించి ప్రజలను,రైతులు,రైతు కూలీలను భయందోళనకు గురి చేస్తే ప్రస్తుతం వైల్డ్ క్యాట్ దాడి వల్ల రైతులు మరింత భయపడుతున్నారు . ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతు వేడుకుంటున్నాడు.





పీకలు కొరికేయడంతో చనిపోయిన కోళ్లు.. ఘటనాస్థలంలో అటవీ అధికారి పరిశీలన.. చనిపోయిన కోళ్లను చూపుతున్న రైతు

యుద్ధానికి సంసిద్ధం!

ఉద్యోగుల.. ఉద్యమబాట



రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన

- సర్కారుపై నిరసన గళం
- ఉద్యమించిన ఉద్యోగులు
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు
- 4 రోజుల పాటు నిరసనలు
- డిమాండ్ల సాధనకు పోరాటం
- 27న చలో విజయవాడ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : సర్కారు తీరుపై ప్రభుత్వ ఉద్యోగులు యుద్ధానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వ తీరు కారణంగా నిన్నటి వరకూ బయటకు రావడానికే భయపడిన ఉద్యోగులు తమ నిరసన గళం వినిపిస్తున్నారు. హామీల చిట్టా విప్పి.. డిమాండ్ల సాధన పోరాడుతున్నారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ పిలుపు మేరకు నాలుగు రోజుల పాటు నిరసన తెలియజేయనున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో బుధవారం ఉద్యోగ ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దార్ల ఐక్యకార్యాచరణ(ఏపీ జేఏసీ) కమిటీ పిలుపుమేరకు అందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆయా కార్యాలయ గేట్ల వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి జేఏసీ ఉద్యమ శంఖారావం పేరిట పోరాటబాట చేపట్టిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం సిటీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు.అనంతరం తమ సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ కేంద్రాల్లో ఆర్డీవో,మండల కేంద్రాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీఅండ్ ఫుల్‌టైం పని చేస్తున్నారు. ఆయా ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై నినదించారు. 12వ పీఆర్సీ కమిషన్ వేసినప్పటికీ ఏ మాత్రం ప్రగతి లేదని మండిపడ్డారు. గతేడాది జూలై 1 నుంచి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉన్నా నేటికీ అతీగతీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరల నేపథ్యంలో తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు తమ సొంత డబ్బును వాటాగా కడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, పార్ట్ ఫైనాన్స్ కోసం చేసుకున్న దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని వాపోయారు. సరెండర్ లీవు, ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయిం బర్స్‌మెంట్, 11వ పీఆర్సీ, ఉద్యోగుల టీఏ, డీఏ బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని అందులో వివరించారు. తక్షణమే రూ.25 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలోనూ స్పష్టత లేదని, ఎన్ఎం ఆర్, పార్ట్‌టైం, ఫుల్‌టైం ,ఔట్‌సోర్సింగ్,ఎంటీఎస్ ఉద్యోగ,ఉపాధ్యా యులుగా నియామకమైన వారందరినీ క్రమబద్ధీకరించా లని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లతో జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు..నిరసనలతో హోరెత్తించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ జేఏసీ డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరం జీజీహెచ్, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తమ నిరసన తెలియజేశారు. ఏపీ జేఏసీ నగర సంఘం అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వేణుమాధవ్ మాట్లాడుతూ ఏపీ జేఏసీ రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక, పెన్షనర్లను కోరుతున్నామన్నారు. జేఏసీ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.షరీఫ్, పించనుదారుల సంఘం నాయకులు కేకే సంజీవరావు, పార్వతి, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, వెంకటరమణ, నగర ఎన్జీవో సంఘం నాయకులు అనిల్‌కుమార్, ప్రతాప్, రాజశేఖర్, శాంతిసాగర్, ఆనంద్, వివిధశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోరు ఇలా..

తాళ్ళపూడి, ఫిబ్రవరి 14 : గురువారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తారని ఏపీ జేఏసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరు కావాలని మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో తమ నిరసనలు తెలియజేయాలన్నారు. 17వ తేదీన తహశీల్దార్ కార్యలయాల వద్ద ధర్నా చేయాలని, 20వ తేదీన కలెక్టరేట్ వద్ద ర్యాలీ, ధర్నా చేయాలన్నారు. 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ రాష్ట్ర నాయకులు జిల్లాల పర్యటన చేస్తారని 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్యమ కార్యా చరణ కమిటీ ప్రకటించిందని తెలిపారు.



రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

హంగు.. ఆర్భాటమే!

అధ్వానంగా డ్రెయినేజీ

చేసింది కొంతే.. చెప్పేది కొండంత



- నగరంలో అటకెక్కిన అభివృద్ధి
- ఐదేళ్లుగా సమస్యలపై దృష్టి లేదు..
- అంచనాలు రూ.350 కోట్లు
- సీఎం హామీ రూ.125 కోట్లు
- ఇచ్చింది రూ. 20 కోట్లు
- ఖర్చు చేసింది రూ.70 కోట్లే?
- సాధారణ నిధులతో అభివృద్ధి
- మిగిలిన రూ.280 కోట్లేవి
- వైసీపీ నాయకుల డబ్బా

రాజమహేంద్రవరం సిటీ,ఫిబ్రవరి 14 : గతంలో ఎన్నడు లేనివిధంగా అభివృద్ధి చేశాం.. కావాంటే చూసుకోండి అంటూ గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీ నాయకుల అంచనాలు కొండలు దాటితే వాస్తవికతకు చాలా భిన్నంగా ఉందనే లెక్కలు చెబుతున్నాయి.రాజమహేంద్రవరం అభివృద్ధికి చాలా కష్టపడ్డామని వైసీపీ నాయకులు చెబుతున్నా అలా ఎందుకు అంటున్నారో జనానికి అర్థం కావడంలేదు. ఎందుకంటే అసలుది వదిలేసి.. కొసరుది పట్టుకుని అభివృద్ధి చేశాం..అభివృద్ధి చేశాం అంటే ఎవరు మాత్రం హర్షిస్తారు.. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో వైసీపీ నాయకులు చేస్తున్నది అదే.. చేసింది కొంతే.. చెప్పేది మాత్రం కొండంత..

సమస్యలివీ..

చారిత్రక రాజమహేంద్రవరాన్ని పట్టిపీడిస్తున్న డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, గోదావరి కాలుష్యం తదితర సమస్యలకు శాశ్వతం పరిష్కారం లభించలేదనే చెప్పవచ్చు. అందుకు జరిగిన ప్రయత్నాలు అన్ని మధ్యలోనే ఆగిపోయాయి. ఇక రాజమహేంద్రవరం అభివృద్ధి అంటే కంబాల చెరువు పార్కు బ్యూటిఫికేషన్,లైటింగ్, సాయంత్రం వేళలో సేదతీరేవిధంగా వాతావరణం సృష్టించడం కాదు. నగరం లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్యను పరిష్కరించడం. అంతే కాకుండా నగరాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య డంపింగ్ యార్డ్.. రోజువారి వచ్చే చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి.దీంతో నగరంలో దోమలు, పందులు విజృంభిస్తున్నాయి. కొన్నిప్రాంతాల్లో లెట్రిన్ అవుట్ లెట్లను నేరుగా మేజర్ డ్రైనేజీలకు కలిపివేసిన సమస్యలు పెద్దవనే చెప్పాలి. కానీ అవేమీ పాలకులు పరిగణనలోకి పెద్దగా తీసుకోకపోవడం రాజమహేంద్రవరానికి శాపంగా పరిణమించింది.

హంగుకే రూ.100 కోట్లు ..

రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో గడచిన నాలుగున్నరేళ్లలో సుమారు రూ.300 కోట్ల పనులకు అంచనాలు వేశారు. కానీ గొప్పవిషయం ఏమిటంటే కనీసం రూ.100 కోట్ల రూపాయల పనులు కూడా పూర్తి చేయలేకపోయారు. రాజమహేంద్రవరానికి సీఎం జగన్ ప్రత్యేక గ్రాంట్ రూ.125 కోట్లు ఇచ్చారని చెబుతున్న ప్రజాప్రతినిధి అసలు ఎంత నిధి వచ్చిందో చెప్పరు.. ఎందుకంటే కేవలం వచ్చింది రూ.20 కోట్లు మాత్రమే. అందులో రూ.18 కోట్లు బిల్లులు అయిపోయాయి. మిగిలింది దైవాదీనం.. నగరంలో ఇప్పటి వరకు జరిగిన పనులు చూస్తే డ్రైనేజీలకు సుమారు రూ.20 కోట్లు, సీసీ రోడ్లకు రూ.15 కోట్లు, కంబాచెరువు ఆధునీకరణకు రూ.13 కోట్లు కేటాయించగా ఇప్పటికి సుమారు రూ.7 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. సుబ్రహ్మణ్యదానంలో ఓపెన్ థియేటర్ ఆడిటోరియం వగైరా పనులకు మంజూరు చేసింది రూ.5 కోట్లు ఇప్పటి వరకూ ఖర్చుచేసింది రూ.2 కోట్లు మిగిలిన పనులు చేయాల్సి ఉంది. మొత్తం నాలుగున్నరేళ్ళలో సుమారు రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్ల మధ్య మాత్రమే పనులు జరిగినట్టు ప్రాథమిక అంచనా. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిలో 70 శాతం కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చుచేసినవే.మరి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు అంటూ డబ్బాలు కొడుతున్న వారు రేపు ప్రజలకేం సమాధానం చెబుతారో చూడాలి.

మసిపూసి మారేడుకాయ..

ప్రజల జీవనానికి అవసరమైన వాటికి తొలిప్రాధాన్యత ఇచ్చాక అటుపై హంగులు ఆర్భాటాలు వంటివి గత ప్రభుత్వాలు చేసేవి.. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం కాస్త భిన్నం.. ఏం చేసినా పైకి కనిపించాలి.. అంతే దాని ఉపయోగం ఎంత అనేది ఆలోచించరు. అందుకే ముందు హంగులు ఆర్భాటలు చేసింది.. నగరంలో దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్న మురుగునీటి పారుదల సమస్య, నల్లచానల్ గుండా నేరుగా గోదావరిలో కలుస్తున్న మురుగు, , పేపరుమిల్లు కాలుష్యం, గోదావరి కలుషితం, క్వారీ ప్రాంతంలో గోతుల్లో పడి అనేక మంది మృత్యువాత పడుతున్న సమస్య, పందులు, దోమలు, డెడికేటెడ్ చానల్ నిర్మాణం, నగరంలో పారిశుధ్యకార్మికుల కొరత, 24 గంటల సురక్షిత మంచి నీటి సమస్య, శీలం నూకరాజు కాంప్లెక్స్ రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, జాంపేట ఉమారామ లింగేశ్వర కల్యాణ మండపం రోడ్డు, మెయిన్ రైల్వే స్టేషన్ రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. ఇలా అనేక సమస్యలతో రాజమహేంద్రవరం సతమతమౌతోంది. తనను బాగుచేసే ప్రభుత్వం, ప్రజాప్రతినిధి కోసం ఎదురుచూస్తుందనే చెప్పవచ్చు. వైసీపీ నాయకులకు ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల పుణ్యకాలం కాస్త అయిపోయింది. ఇప్పుడు కొన్ని చోట్ల రాత్రికి రాత్రే మసిబూసి మారేడు కాయ చేసే పనులు పాలకులు చేయడం విడ్డూరంగా ఉంది.



అసంపూర్తిగా నిలిపివేసిన రోడ్డు నిర్మాణ పనులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు...



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌ఠాగూర్ చిత్రంలో నాయకులు

కాంగ్రెస్‌ను హైజాక్ చేసిన జగన్

కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ ఠాగూర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను జగన్‌రెడ్డి హైజాక్ చేయడంతో ఆంధ్రాలో పార్టీ దెబ్బతిందని ఆ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ ఠాగూర్ అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి వీక్ చేశాడన్నారు. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షురాలిగా నియమితులైన వైఎస్ఆర్ కుమార్తె షర్మిళారెడ్డి ఆంధ్రాలో కాంగ్రెస్‌కు పునర్జీవం పోశారన్నారు. ఇప్పుడు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసుకుంటున్నామని చెప్పారు. 2024 ఎన్నికల్లో యుద్ధానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాం గ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగుతున్నారని ఇప్పటికి 1200 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ నెల 29న జాబితా ఫైనల్ చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం సీడబ్ల్యూసీ సభ్యుడు రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆంధ్రాలోను నాలుగు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో గిడుగు రుద్రరాజు, సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ,రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, ముళ్ళ మాధవ్, తాళ్ళూరి విజయకుమార్,మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభిప్రాయాల సేకరణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో ఛాంబర్, రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు మాత్రమే ఫారం 7 స్వీకరించడం జరుగుతుందన్నారు.సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెండు బయో గ్యాస్ ప్లాంట్స్ : కలెక్టర్

కొవ్వూరు, ఫిబ్రవరి 14 : కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో 36 ఎకరాల్లో 43 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో 256 కోట్ల పెట్టుబడితో 270 మందికి ఉపాధి ఇచ్చేలా రెండు బయో ప్లాంట్స్ యూనిట్స్ నెలకొల్పనున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. కాపవరం గ్రామంలో రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించి శిలాఫలకాన్ని బుధవారం మంత్రి గుడివాడ అమర్నాథ్ వెలగపూడి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ తొలిదశలో 1024 కోట్ల పెట్టుబడితో 1080 మందికి ఉపాధి లక్ష్యంగా 8 కంప్రెస్‌డ్ బయో గ్యాస్ ప్లాంట్‌లు నెలకొల్పనుందన్నారు. కొవ్వూరు మండలం కాపవరం, దొమ్మేరు గ్రామాల్లో రెండు బయో ప్లాంట్స్ యూనిట్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆరు నెలల్లో ఉత్పత్తి రావడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, సంక్షేమశాఖ అధికారులు కె.ఎస్.జ్యోతి, ఎం.సందీప్, రిలయన్స్ బయో ఎనర్జి ప్రతినిధులు జి.కృష్ణకుమార్, ఎం.సుధీర్, ఆర్.మంజ్రేకర్ రెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లకు శ్రీకారం

పిఠాపురం, ఫిబ్రవరి 14: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయంలోని రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి


పందిరి రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ పులి నారాయణమూర్తి పందిరిరాట ముహూర్తం చేశారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు.

వసంతపంచమి వేడుకలు

పాదగయ క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. సరస్వతి దేవికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చుక్కలు చూపిస్తున్న వెల్లుల్లి

కిలో రూ.360 నుంచి రూ.400



సామర్లకోట, ఫిబ్రవరి 14: సామాన్యులకు ఉల్లిధరలు ఊరటనిస్తుంటే వెల్లుల్లి ధరలు మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి. కొంతకాలంగా కిలో రూ. 20 నుంచి రూ. 35 వరకూ విక్రయించిన ఉల్లి ధరలు తగ్గుముఖం పడుతుంటే వెల్లుల్లి ధరలు మాత్రం రూ. 300 నుంచి రూ. 360 వరకూ పలుకుతుండగా మరీ ప్రత్యేక రకం వెల్లుల్లి మాత్రం బుధవారం సామర్లకోట, పెద్దాపురం మార్కెట్లలో కిలో రూ. 400 వరకూ పలికింది. గత నెల చివరి వరకూ కిలో వెల్లుల్లి రూ. 200 వరకూ విక్రయించగా ఒక్కసారిగా రూ 360 నుంచి రూ. 400 వరకూ అమాంతంగా పెరిగింది. దీంతో సామాన్యులే కాదు ధనికులు సైతం వామ్మో అంటున్నారు. సామాన్యులు వెల్లుల్లి మాట ఎత్తాలంటేనే భయపడిపోతున్నారు. రాబోయే వేసవిలో పచ్చడి పెట్టేందుకు ఎక్కువగా ఉపయోగించే వెల్లుల్లి ధర పెరగడంతో పచ్చడి ప్రియులకు ఆందోళన కలిగిస్తోంది. వెల్లుల్లి పంట ఈ ఏడాది బాగా తగ్గినట్లు హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ బంగ్లాదేశ్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాలలో వరదలకు వెల్లుల్లి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తెలుగు రాష్ట్రాలలో ఈ పంట లేకపోవడం, దిగుమతులు తగ్గడంతో వెల్లుల్లికి సహజంగానే డిమాండ్ పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే ధర మరింత పైపైకి ఎగబాకే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

రత్నగిరిపై పలు అభివృద్ధి పనులకు ఆమోదం

- రూ.46.75 లక్షలతో సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవ పనులు
- రూ.25.50 లక్షలతో కోరుకొండ కల్యాణోత్సవ పనులు
- రత్నగిరిపై దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు గ్రీన్‌సిగ్నల్
- రూ.60 లక్షలతో కోరుకొండ మెట్లమార్గం అభివృద్ధి పనులపై చర్చ
- అంతరాలయ దర్శన టిక్కెట్ల రేట్లు మార్పు నిర్ణయం వాయిదా


పాలకమండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, ఫిబ్రవరి 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో పలు అభివృద్ధి పనులకు బుధవారం పాలకమండలి ఆమోదం తెలిపింది. ఛైర్మన్ ఐ.వి రోహిత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై సభ్యులు, ఈవోతో చర్చించి ఆమోదం తెలిపారు. ప్రధానంగా సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాలకు వివిధ ప్రాంతాల్లో రంగులు, షామియానాలు ఏర్పాటు, విద్యుద్దీప అలంకరణలకు రూ.46.75 లక్షలతో తయారుచేసిన అంచనాలను ఆమోదించారు. స్వామివారి సన్నిధిలో అన్నదానం, వివిధ పథకాలకు విరాళం అందించిన దాతలకు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు విరాళమిచ్చిన వారికి 10 ఏళ్లపాటు ఏడాదిలో వారి కుటుంబసభ్యులకు రెండు పర్యాయాలు ప్రత్యేక దర్శనం, వసతి సౌకర్యం కల్పించాలని రూ.10లక్షల పైబడి విరాళమిచ్చే దాతలకు 15 ఏళ్ల పాటు సౌకర్యాలు కల్పించాలని వీరికి ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని నిర్ణయించారు. నూతనంగా తయారవుతున్న టేకు రథం నిలుపుప్రదేశం పీపీసీకి మార్చాలని తీర్మానించారు. రూ.26 లక్షలతో వనదుర్గ మార్గ్ వద్ద మట్టి పూడ్చి గాబియన్ వాల్ నిర్మాణం, రూ.6.30 లక్షలతో ఆదిశంకర్ మార్గ్ వద్ద డ్రెయిన్, కొండకు మధ్య మట్టిపూడ్చడం, సత్యగిరి నుంచి గిరి ప్రదక్షిణ రోడ్డు తాత్కాలికంగా నిలుపుదల చేసి రూ.4.50 లక్షలతో ఎర్త్ ఫిల్లింగ్, సత్యగిరి జంక్షన్ నుంచి హరిహరసదన్ కచ్చారోడ్డు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.9.50 లక్షలు, రూ.18 లక్షలతో ఇటీవల అన్నవరం దేవస్థానానికి అప్పగించిన కిర్లంపూడి సత్రం రంగులు, ఇతర అభివృద్ధి పనులకు, రూ.11.50 లక్షలతో సహజ వెనక భాగంలో నిర్మించిన డార్మెటరీకి మిగిలిన పనులు, రూ.8.50 లక్షలతో సత్యగిరిపై మూడో క్యాంటీన్ నిర్మాణ పనులు, రూ.13.50 లక్షలతో పశ్చిమరాజగోపురం వద్ద 30 వీఐపీ కూల్చిన ప్రదేశంలో రిటైనింగ్‌వాల్ నిర్మాణం, కొండ దిగువ రూ.17.50 లక్షలతో మహిళలకు మరుగుదొడ్లు, చైల్డ్‌లింక్ మెస్ ఏర్పాటు తదితర పనుల అంచనాలను ఆమోదించారు. ప్రసాద్ స్కీం నిధుల ద్వారా అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించగా ఆమోదించారు. రూ.40 లక్షలతో స్టెయిన్‌లెస్ స్టీల్ బెంచీలు, క్యూలైన్‌ల ఏర్పాటుకు అంగీకారం లభించింది. ప్రస్తుతం అమలవుతున్న రూ.300 అంతరాలయ టిక్కెట్ దర్శనం ధర మార్పుపై నిర్ణయాన్ని వచ్చే సమావేశానికి వాయిదా వేశారు. మార్చి 19 నుంచి 25 వరకు జరిగే కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలలో వివిధ పనులకు రూ.25.50 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రతిపాదించగా ఆమోదం లభించింది. ఇటీవల పలు వ్యాపార లైసెన్స్ హక్కులకు నిర్వహించిన బహిరంగ వేలంలో హెచ్చుపాటలను, అభివృద్ధి పనులకు పిలిచిన టెండర్లలో లోయస్ట్ టెండర్లను ఆమోదించారు. సమావేశంలో ఈవో రామచంద్రమోహన్, సభ్యులు పేరూరి బద్రీనారాయణ, దోమాడ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో వైభవంగా

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ


జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ, స్వామీజీలు

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి14: జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని ఏలేరు నది తీరాన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 12 ద్వాదశ జ్యోతిర్లింగాలకు జ్యోతుల నెహ్రూ-మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు, సర్వారాయుడు, సునీత దంపతులచే యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానందస్వామి చేతుల మీదుగా ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ఠ చేశారు. శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామి జ్యోతిర్లింగాలు ప్రతిష్ఠ చేసి జ్యోతుల నెహ్రూ, నవీన్ దంపతులచే శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ ఎంతో విశిష్టమైనదన్నారు. నది ఒడ్డున సాక్షాత్తు మహా శివుడే కొలువైనట్లు ఉందన్నారు. ఇక నుంచి ప్రజా సందర్శనతో దివ్యక్షేత్రంగా ఈ జ్యోతిర్లింగాల ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సాక్షాత్తు ఆ పరమశివుని ఆశీస్సులతోనే ఇంతటి మహా కార్యక్రమాన్ని చేపట్టగలిగానని ఏలేరు నది పక్కన నిర్మించిన ఈ జ్యోతిర్లింగాల క్షేత్రాన్ని ప్రజలు నిత్యం సందర్శించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నిత్యం పండితులతో అభిషేక కార్యక్రమాలు జరిపించనున్నట్లు చెప్పారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ మార్చి మొదటి వారంలో ఈ మహాయజ్ఞం కార్యక్రమం పూర్తవుతుందన్నారు. భక్తులందరూ ఈ ద్వాదశ శివలింగాలను దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెలాఖరున జరిగే మహాకుంభాభిషేకంకు రాష్ట్రంలో నుంచి ప్రముఖులు వస్తారన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నవీన్ తెలిపారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ, యనమల కృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, రాజప్ప తనయుడు రంగనాథ్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, పేరాబత్తుల రాజశేఖర్, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు హాజరై జ్యోతిర్లింగాల దర్శనం చేసుకున్నారు. భక్తులు తరలి వచ్చి జ్యోతిర్లింగాల దర్శనం చేసుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

నకిలీ నెయ్యి తయారీ గుట్టురట్టు

- విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారుల సంయుక్త దాడులు
- రూ.7 లక్షల ముడి సరుకు సీజ్
- స్వీట్స్ తయారీ అనుమతులతో కల్తీ నెయ్యి తయారీ


బకెట్లలో నకిలీ నెయ్యి

అనపర్తి, ఫిబ్రవరి 14: మార్కెట్‌లో లభించే ఏ సరుకు కొనాలో, ఏది అసలో ఏది నకిలీనో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మార్కెట్‌లో లభించే నెయ్యి కొంత తక్కువ ధరకు విక్రయించేందుకు ఒక వ్యాపారి నకిలీని ఎన్నుకున్నాడు. వెన్న లేకుండానే టన్నుల నెయ్యిని తయారు చేసి విక్రయాలు సాగిస్తున్నాడు. అనపర్తి మండలం పొలమూరులో వరి పొలాలకు ఆనుకుని గ్రామానికి చెందిన తమలంపూడి రాజారెడ్డి స్వీట్స్ తయారీ పేరుతో కార్ఖానా ఏర్పాటు చేసి రెండేళ్లుగా నకిలీ నెయ్యి తయారు చేస్తూ విక్రయాలు సాగిస్తున్నాడు. తయారు చేసిన కొంత భాగాన్ని ఒడిసాకు తరలిస్తుండగా కొంత భాగాన్ని ఇక్కడ రిటైల్ మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. మార్కెట్‌లో లభ్యమైన నకిలీ నెయ్యి డబ్బాపై ఎటువంటి నిర్దిష్టమైన ప్రచురణలు లేకపోవడంతో విజిలెన్స్ అధికారులు తయారీ కేంద్రంపై దృష్టి సారించారు. బుధవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సన్‌ఫ్లవర్ ఆయిల్, వనస్పతి, పామాయిల్, జాబిలాల సీడ్స్, ఆర్టిఫిషియల్ ఫ్లేవర్‌తో ధనేశ్వరి బ్రాండ్‌పై నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్టు గుర్తించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సుమారు రూ.7 లక్షల విలువైన ముడి సరుకును సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ముత్యాల నాయుడు మాట్లాడుతూ నకిలీ నెయ్యి తయారీ చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. స్వీట్ తయారీ పేరుతో అనుమతులు తీసుకుని నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించామని, సుమారు టన్ను నకిలీ నెయ్యి స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్ధి పేరుతో నకిలీ నెయ్యి తయారు చేస్తున్న రాజారెడ్డిపై కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. తయారీ కేంద్రంలో సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు తరలిస్తున్నామని నివేదిక ప్రకారం క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు మాట్లాడుతూ ప్యాకింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కాటాపై సీల్, ప్యాకింగ్‌పై కస్టమర్ కేర్ నెంబరు ముద్రించి ఉండాలని ఈ మూడు నిబంధనలను పాటించక పోవడంతో మూడు కేసులు నమోదు చేశామన్నారు. విజిలెన్స్ సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, డీటీ శశిధర్ పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అంతర్వేది, ఫిబ్రవరి 14: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల నిర్వహణపై కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం సమీక్షించారు. తొలుత ఆయన ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి కల్యాణ మండపం, రథోత్సవం, 16 స్తంభాల మండపం, షెడ్లు, బస్టాండు, తీర్థయాత్ర సందర్శకుల ప్రదేశాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఉత్సవాలను సమన్వయంతో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో అధికారులందరూ భక్తిశ్రద్ధలతో విధులు నిర్వర్తిస్తూ సేవలందించాలన్నారు. ప్రధానంగా 19వ తేదీ రాత్రి 12.29 గంటలకు స్వామివారి కల్యాణం, 20వ తేదీ మధ్యాహ్నం రథోత్సవం, 24న చక్రస్నానం, 25వ తేదీ సాయంత్రం తెప్పోత్సవం వైభవంగా జరిగేలా చూడాలన్నారు. రథోత్సవం జరిగే ప్రాంతంలో ఎటువంటి దుకాణాలులేకుండా పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు విశ్రమించేందుకు ఏర్పాటు చేసిన వసతులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. శాఖల వారీగా అధికారులు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సంవత్సరం సుమారు 3 నుంచి 4లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారన్నారు. ఉత్సవాలు జరిగే ప్రాంతంలో మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టారు. స్నానాలు చేసే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు, వాచ్ టవర్లు, మైక్ సెట్‌లు, సముద్ర తీర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని, టాయిలెట్లను ప్రతి మూడుగంటలకొకసారి శుభ్రపరిచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తెప్పోత్సవం జరిగే సమయానికి ఆలయ ప్రాంగణంలో ఉన్న చెరువులో నీటిని నింపాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. సముద్ర స్నానం చేసేటప్పుడు భక్తులు కెరటాల బారిన పడకుండా రక్షణకు గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. అత్యవసర సమయంలో వైద్యం అందించేందుకు ఆరు మెడికల్ క్యాంపులను, రెండు అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగినన్ని బస్సులను అంతర్వేదికి నడపాలని ఆర్టీసీ అధికారులను కోరగా 120 బస్సులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. నిర్విరామంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, స్వామివారి కల్యాణం జరిగే సమయంలో బ్యాకప్ కింద జనరేటర్లు అందుబాటులో ఉంచాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. పది రోజుల పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో మద్యం, మాంసం దుకాణాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెండు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బందోబస్తు కోసం వస్తున్న సిబ్బందికి, వైద్య సిబ్బందికి స్కూళ్లల్లో వసతి ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్న కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం చుట్టుపక్కన ఉన్న హోటల్, లాడ్జిల్లో అధిక మొత్తంలో అద్దె వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటక శాఖ అధికారులకు సూచించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ కల్యాణ మహోత్సవాల్లో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఐదు జిల్లాల నుంచి 1,600 మంది పోలీసు సిబ్బందిని తీసుకొస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు, తోపులాటలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని, వన్‌వే రూట్‌లో భక్తులు సురక్షితంగా వెళ్లాలన్నారు. రథోత్సవం రోజున రథం వెళ్లే ప్రాంతాల్లో షాపులకు అనుమతులు లేవన్నారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ కల్యాణోత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులంతా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన్‌వే రూట్ ఉండడం వల్ల స్థానికంగా ఉన్న భక్తులు, వారి బంధువుల ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఉప కమిషనర్ విజయరాజు, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ


21 మందికి గాయాలు..ఒకరి పరిస్థితి విషమం


సంఘటన స్థలంలో ప్రమాద దృశ్యం

తుని రూరల్, ఫిబ్రవరి 14: 16వ నెంబరు జాతీయ రహదారిపై తుని రూరల్ వి.కొత్తూరు కూడలి వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొట్టిన ఘటనలో 21 మంది గాయాలపాలయ్యారు. రాజమహేంద్రవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అక్కడి నుంచి తునికి వచ్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. హైవే రోడ్డు నుంచి తుని సర్వీసు రోడ్డుకు మళ్ళే క్రమంలో వి.కొత్తూరు కూడలి వద్ద బెంగాల్ నుంచి కేరళ వెళుతున్న లారీ ఆర్టీసీ బస్సును బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో లారీ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది గాయాలపాలయ్యారు. భారీ శబ్దంతో లారీ ఢీకొనడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. రోదనలు మిన్నంటాయి. స్థానికులతో పాటు సమీప రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని బస్సులో ఇరుక్కున్న ప్రయాణికులను బయటకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. గాయపడ్డ 21 మందిని 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కిర్లంపూడి మండలం వేలంకి గ్రామానికి చెందిన ఐతా అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. వివాహ శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో బస్సులో ప్రయాణిస్తున్న వారు శుభకార్యాలకు వెళుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. సంఘటన స్థలంతో పాటుగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని తహసీల్దార్ భరత్‌రెడ్డితో పాటు రూరల్ సీఐ పరామర్శించారు. రూరల్ ఎస్ఐ డి.రమేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


దళిత సర్పంచ్‌కు అవమానం

- సమాచారం ఇవ్వకుండానే పంచాయతీ సమావేశం
- కార్యాలయం ఎదుట సర్పంచ్ నిరసన


కార్యాలయం వద్ద ఆందోళన

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 14: పిఠాపురం మండలం నవఖండ్రవాడలో దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం జరిగింది. తనకు సమచారం ఇవ్వకుండానే పంచాయతీ సమావేశం నిర్వహించి తీర్మానాలు నమోదు చేయడంపై సర్పంచ్ నిరసనకు దిగారు. నవఖండ్రవాడ సర్పంచ్ బళ్ల రజనీవాణి వైసీపీలో జరుగుతున్న అవమానాలు భరించలేక కొంత కాలం క్రితం తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి ఆమెకు అధికారులు నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతున్నది. నవఖండ్రవాడ గ్రామపంచాయతీ సమావేశాన్ని ఈ నెల 8వ తేదీన ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి వార్డు సభ్యులు ఎవ్వరు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. తిరిగి బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. వార్డు సభ్యులందరికి నోటీసులు ఇచ్చి తనకు సమావేశం నోటీసు ఇవ్వలేదని సర్పంచ్ బళ్ల రజనీవాణి తెలిపారు. సర్పంచ్ హాజరు కాలేదని సాకు చూపించి అభివృద్ధి పనుల నిర్వహణకు గానూ విలేజీ లెవెల్ కమిటీ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేశారని చెప్పారు. దళిత సర్పంచ్ అయిన తనను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కావాలనే అవమానిస్తున్నారని ఆరోపిస్తూ అతనిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి విధులు నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ రజనీవాణి తన భర్తతో కలిసి పిఠాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం ఆందోళనకు దిగారు. ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు ఆదేశాల మేరకు తనను పంచాయతీ కార్యదర్శితో పాటు అధికారులు అవమానానికి గురిచేస్తున్నారని సర్పంచ్ బళ్ల రజనీవాణి తెలిపారు. వార్డు సభ్యుల వద్ద పంచాయతీ రికార్డులు ఉంచి ఆ నెపం తనపై వేసి సర్పంచ్ పదవిని నుంచి తొలగించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెండేళ్లుగా తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దళిత సర్పంచ్ అయిన తనను వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా సర్పంచ్ ఆరోపణలపై విచారణ జరుపుతామని ఎంపీడీవో చిన్నారావు తెలిపారు.

సిద్ధి వినాయక ఆలయం కిటకిట


స్వామివారి వద్ద కలాలను ఉంచి పూజ

అయినవిల్లి, ఫిబ్రవరి 14: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం మాఘ పంచమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. గణపతి పూజ, సరస్వతి కల్పం, సరస్వతి మండపారాధన, సరస్వతి హోమం నిర్వహించారు. లక్ష కలాలను స్వామివారి పాదాల చెంతన ఉంచి పూజ చేశారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.10 లక్షలు


దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి బుధవారం నంది గామకు చెందిన కోవెలమూడి వెంకటనారాయణ వసంత సంధ్యారాణి దంపతులు రూ.10 లక్షలు విరాళం సమర్పించారు. మహారాజ పోషకులకు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో మన్యం బాను, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, ఫిబ్రవరి 14: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని విజయవాడకు చెందిన బండారు కృష్ణప్రసాద్-అరుణకుమారి దంపతులు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతను శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం ఛైర్మన్ గుత్తుల నాగబాబు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు అందజేశారు.

ఐక్యతతో పనిచేస్తే కాంగ్రెస్ బలోపేతం

ఐదు జిల్లాల నేతలతో మాణిక్‌ఠాకూర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: అందరు ఐక్యతతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, ఎంపీ మాణిక్ ఠాకూర్ సూచించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, ఏలూరు, అమలాపురం జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులతో రాజమహేంద్రవరం పేపరుమిల్లు సమీపంలోని కృష్ణసాయి కల్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికలకు బూత్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఏఐసీసీ సెక్రటరీ సీడీ మెయ్యప్ప, ఏఐసీసీ శాశ్వత సభ్యుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ముళ్ళ మాధవ్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, అనపర్తి ఇన్‌చార్జి వడయార్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాండురంగారావు, నర్సాపురం అధ్యక్షుడు నార్నిడి బాబ్జి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ

రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నగరంలో ఇటీవల నిర్వహించిన ఒక కార్యక్రమానికి సంబంధించి అంశం అక్కడ లేవనెత్తడంతో బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్ కు మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ సంఘటనలో బాలేపల్లి మురళీధర్ దవడకు గాయం కావడంతో వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు వైద్యచికిత్స అందించారు. తనపై బోడా వెంకట్ దాడి చేశాడని బాలేపల్లి మురళీధర్ ప్రభుత్వాసుపత్రి అవుట్ పోస్టులో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేశవరం వేదికపై వేగుళ్ల, తోట

కేశవరంలో గెలుపొందిన వారే ఎమ్మెల్యేగా నిలబడాలని ప్రతిన


మాట్లాడుతున్న తోట, వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 14: మండపేటలో రాజకీయం వేడుక్కుతోంది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎన్నికలకు ముందే పోటీకి సై అంటే సై అంటున్నారు. ఇటీవల ఇద్దరు నేతలూ మండపేట మం డలం కేశవరం గ్రామాన్ని యూనిట్ గా ఎంపిక చేసుకుని పోటీకి సిద్ధమని వేర్వేరుగా ప్రకటనలు చేశారు. దానికి కట్టుబడి ఉన్నామని బుధవారం ప్రకటించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలోని ఎమ్మెల్సీ తోట చాంబర్‌లో ఇద్దరు నేతలూ కేశవరంలో జరిగే ఎన్నికకు సంబంధించి విధి విధానా లను రూపొందించి మీడియా సమక్షంలో ఎన్నిక నిర్వహించాలని సూచించారు. ఇద్దరం పోటీకి సిద్ధమని... కేశవరంలో ఎవరు ప్రజా బలంతో గెలుపొందితే వారే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలని, ఈ విషయాన్ని తమ పార్టీ నేతలతో ప్రకటన చేయిస్తామని వెల్లడించారు. నియోజకవర్గంలో 42 గ్రామాలు, మున్సిపాలిటీ ఉండగా కేవలం కేశవరాన్నే ఎందుకు ఎంచుకున్నారని విలేకరులు ప్రశ్నించారు. గత మూడు ఎన్నికల నుంచి అక్కడ టీడీపీకి మెజారిటీ వచ్చిందని... అక్కడ తాను అవినీతికి పాల్పడ్డానని ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యానించిన నేపథ్యంలో తాను కేశవరంలో ప్రజా తీర్పు కోరుకుంటున్నానని తోట చెప్పారు. అక్కడి ప్రజలు ఇచ్చే తీర్పునకు తామిద్దరం కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఎప్పుడు పోటీ నిర్వహించాలో తర్వాత వెల్లడిస్తామన్నారు.

ఏజెన్సీ సమాచారం

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరి

దేవీపట్నం, ఫిబ్రవరి 14: కార్యకర్తలు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరి అన్నారు. ఇందుకూరుపేట గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు ఎవరికి టికెట్ ఇచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యకర్తలు మధ్య చిన్న చిన్న విభేదాలు ఉంటే సర్దుకుని ముందుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ వైస్ ప్రెసిడెంట్ జెఎస్ నగేష్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గోళ్ల చంటిబాబు, రాష్ట్ర రైతు కార్యదర్శి మాగాపు బాబూరావు, మాజీ ఎంపీటీసీ ముచ్చి వీర వెంకటసత్యనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మాగాపు బాబూరావు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతో ముందుకు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చింతూరు, ఫిబ్రవరి 14 : ఐక్య పోరాటంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు సన్నద్ధమైనట్టు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కెచ్చెల కల్పన పేర్కొన్నారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయం ముందు బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా జాతీయ స్థాయిలో పలు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయన్నారు. ప్రజాపంథా, పీసీసీ సీపీఐ ఎంఎల్ తదితర విప్లవ కమ్యూనిస్టు పార్టీలు మాస్‌లైన్‌గా ఏర్పడ్డాయన్నారు. ఈ మేరకు మార్చి 3, 4, 5 తేదీలలో తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో జాతీయ స్థాయి సమావేశాలు , భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కల్పన తెలిపారు. రాష్ట్ర స్థాయి నాయకుడు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ సమావేశాలకు భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు పలు సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరుతూ వినతిపత్రం అందజేశారు. సకాలంలో తునికాకు సేకరణ పనులు చేపట్టాలని, 50 ఆకుల తునికాకు కట్టకు రూ.5 లు వంతున చెల్లించాలని, తునికాకు సేకరణలో భాగంగా చోటు చేసుకుంటున్న ప్రమాదాలకు ప్రమాద బీమా చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పి.శిరమయ్య, కె.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు నిర్మించాలి

దేవీపట్నం, ఫిబ్రవరి 14: కొండమొదలు, తున్నూరు గ్రామ పంచాయతీలకు కొత్త సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు బిల్డింగ్స్ మంజూరు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. కొండమొదలు సచివాలయం ఆర్‌అండ్‌బీ కాలనీ పెదభీంపల్లి 3 నందు బుధవారం జరిగిన కార్యక్రమంలో తెల్లం శేఖర్ మాట్లాడుతూ కొండమొదలు, తున్నూరు గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 18 గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ 18 గ్రామాల్లో కొన్ని గ్రామాలు పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం కారణంగా సర్వం కోల్పోయి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు వచ్చాయన్నారు. కొండమొదలు, తున్నూరు గ్రామ పంచాయతీలకు కలిపి తాత్కాలికంగా సచివాలయం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పెదభీంపల్లిలో ఏర్పాటు చేశారన్నారు. అయితే పాత గ్రామాల్లో ఉన్న ప్రజలు సచివాలయానికి రావాలంటే 58 కిలోమీటర్లు ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై వెళ్లడంతో ప్రస్తుత ఇన్‌చార్జి డిజిటల్ అసిస్టెంట్‌కు భారం పెరిగిందన్నారు. తాత్కాలిక సచివాలయం చిన్న గదిలో ఏర్పాటు చేయడం వల్ల సచివాలయ సిబ్బంది, 24 మంది గ్రామ వలంటీర్లు ప్రజలకు సేవలందించడానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన సచివాలయం, రైతు భరోసా కేంద్ర బిల్డింగులు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ

వరరామచంద్రాపురం ఫిబ్రవరి 14: రేఖపల్లిలోని వెలుగు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. అలాగే రైతులకు సబ్సిడీపై పైవాన్ స్ప్రేయర్‌లను పంపిణీ చేశారు. అనంతరం రేఖపల్లిలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని, రాజుపేట, రేఖపల్లి గ్రామ పంచాయతీలలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు మాదిరెడి సత్యనారాయణ (సత్తిబాబు), రాష్ట్ర నాయకుడు మాచర్ల గంగయ్య, ఎటపాక డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ కమిషన్ సభ్యులు చిక్కాల బాలు, రాష్ట్ర నాయకులు ముత్యాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ముత్యాల భవాని, మామిడి రాజు, వెంగళరావు, కాంతారావు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటనపై హర్షం



పీవీకి నివాళులర్పిస్తున్న అధికారులు

మోతుగూడెం, ఫిబ్రవరి14: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించిన నేపథ్యంలో చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఏపీ జెన్కో చెక్‌పోస్టు వద్ద అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్ ఆధ్వర్యంలో బుధవారం పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఐదు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఏపీ జెన్కో ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.ప్రసాద్, డీఈటీ వరప్రసాద్, సివిల్ ఏడీ, ఈడీలు కొండబాబు, సబ్బయ్య, షిఫ్ట్ ఏడీఈ రవి వీరులు మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఏపీ జెన్కో సిబ్బంది పాల్గొన్నారు. పుల్వామా వీరులకు నివాళులు

పుల్వామా వీరులకు నివాళులు

వై.రామవరం,ఫిబ్రవరి 14: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రదాడిలో మరణించిన వీరజవాన్లకు బుధవారం మండలంలో పి.ఎర్రగొండ గిరిజన సంక్షేమ ఏకలవ్య పాఠశాలలో నివాళులు అర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జరిగిన సంఘటనను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జవాన్లకు నివాళులర్పించి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతి మాతకు పూజలు

మోతుగూడెం, ఫిబ్రవరి14: మోతుగూడెంలో శ్రీ ప్రసన్న సద్గురు సాయిబాబా ఆలయంలో శ్రీ వసంత పంచమి పూజలు ఘనంగా నిర్వహించారు. సరస్వతి అమ్మవారికి పంచామృతాల అభిషేకాలు జరిగాయి.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట, ఫిబ్రవరి 14: మండలంలోని జి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు, వార్షిక మరమ్మతుల కారణంగా ఈ నెల 16న విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా జి.దొంతమూరు, వీరంపాలెం, వీరంపాలెం పాకలు, బాలవరం గ్రామాలకు, వ్యవసాయ బోరులకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తామన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

» అనపర్తిలో ప్రారంభించిన రామకృష్ణారెడ్డి దంపతులు

అనపర్తి, ఫిబ్రవరి 14: అనపర్తి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా దాదాపు ఖరారైన పార్ట రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం లాంఛనంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ప్రతి ఎన్నికలకు సెంటిమెంట్‌గా ప్రచార కార్యక్రమానికి అనపర్తిలోని రామారెడ్డి మాస్టారు దంపతులను, మహేంద్రవాడలోని అబ్బూస్‌రెడ్డి దంపతులను కలుసుకుని ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మహేంద్రవాడలో అబ్బూస్‌రెడ్డి దంపతుల ఓట్లను అభ్యర్థిస్తున్న రామకృష్ణారెడ్డి

టీడీపీలో పలువురి చేరిక

బిక్కవోలు, ఫిబ్రవరి 14: మెళ్లూరులో బుధవారం రాత్రి వట్టూరి అర్జునరావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం ఎంపీ సీటు ఇవ్వండి

అధినేత చంద్రబాబుకు టీడీపీ నేత గన్ని కృష్ణ లేఖ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: రాజమహేంద్రవరం ఎంపీ సీటును తనకు కేటాయించాలని టీడీపీ సీనియర్ నాయకుడు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ ఆ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ మేరకు చంద్రబాబుకు ఆ లేఖను బుధవారం పంపించారు. పొత్తుల వల్ల అవకాశం రాకపోయినా మీరు నిర్దేశించిన ప్రకారం పార్టీ విజయం కోసం కృషి చేస్తానని ఆ లేఖలో పేర్కొన్నారు.

వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం

హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ప్రకటించాలని వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేయడం అసంబద్ధమని గన్ని కృష్ణ అన్నారు. వైవీ మాటలు హేతుబద్ధంగా లేవన్నారు. నాలుగేళ్లుగా లేని కొత్త డిమాండ్ ఇప్పుడు ఎందుకు తెరపైకి తెచ్చారో ప్రజలందరికి అర్థమైందన్నారు.

టీడీపీ ఎంపీ సీటు శెట్టిబలిజలకు కేటాయించాలి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14 :రాజమహేంద్రవరం టీడీపీ ఎంపీ సీటును శెట్టిబలిజలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానబోయిన రామారావు కోరారు. స్థానిక తిలక్ రోడ్డులో సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నుంచి శెట్టిబలిజలకు సీటు ఇవ్వాలని చంద్రబాబును కోరుతున్నామన్నారు. జిల్లా కార్యదర్శి కెవివి సత్యనారాయణ, అనపర్తి అధ్యక్షుడు గుత్తుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టీడీపీ ఆలోచించుకోవాలన్నారు. శెట్టిబలిజల ఓటింగ్ శాతాన్ని బట్టి సీట్లు కేటాయిస్తే మంచిదన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గురుజారపు వీరభద్రరావు, మేడిశెట్టి సూర్యనారాయణ, గుత్తుల గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తావా.. చంపేయమంటావా!

యువకుడిని బెదిరించి డబ్బులు గుంజిన అల్లరి మూకలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి హైవేలోనే కాదు నగరంలోనూ తిరగడమంటే ప్రాణాలతో చెలగాటమేనని 'ఆంధ్రజ్యోతి' బుధవారం వెలువరించిన కథనానికి ఇదే తాజా రుజువు. తిలక్‌రోడ్‌లో నివాసం ఉంటున్న ఎ.లక్ష్మణ్ జేఎన్ రోడ్‌లోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రివేళ డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. కొద్ది దూరం వెళ్లాక ఓ ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి అతడిని ఆపారు. బంగారం, డబ్బులు ఇవ్వాలని.. లేకపోతే చంపేస్తామని బెదిరించారు. తన దగ్గర బంగారం లేదని.. రోజూవారీ జీతంగా తీసుకున్న రూ.800 ఉన్నాయని వణికిపోతూ చెప్పాడు. అల్లరిమూక అతడి వద్ద ఆ డబ్బులు గుంజుకొని బైక్‌పై వేగంగా పరారైంది. లక్ష్మణ్ ప్రకాశంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు చేయడానికి భయపడి సొత్తును అల్లరిమూకల చేతిలోపెట్టి ఎంత మంది వెళ్లిపోతున్నారనే ఆందోళన నగరవాసుల్లో వ్యక్తమవుతోంది.

ఏఎస్‌రావు టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 14: ఏఎస్‌రావు సైన్సు టాలెంట్ టెస్ట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో సత్తా చాటారు. రాజమహేంద్రవరం షిర్డిసాయి విద్యానికేతన్ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్యా ప్రోగ్రాంలో 10వ తరగతి చదువుతున్న ఎ.లోహిత్ కుమార్ 2వ ర్యాంకును, కేవీఎంకే ప్రణీత్ 5వ ర్యాంకును కైవసం చేసుకోగా 9వ తరగతి చదువుతున్న ఐ.సత్యవంశీ 3వ ర్యాంకును, పి.హర్షిత్‌సాయి 7వ ర్యాంకు సాధించారన్నారు. 11 మంది విద్యార్థులు 30 లోపు ర్యాంకులు సాధించినట్టు శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని శ్రీవిద్యతోపాటు చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, లక్ష్యా ప్రోగ్రాం డీన్ కె.శ్రీనివాస్ అభినందించారు.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

రంగంపేట, ఫిబ్రవరి 14: జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ నాయకుడు యలమర్తి చిట్టిబ్రహ్మం అన్నారు. బుధవారం మండలంలోని ఈలకొలను గ్రామంలో జనసేనపార్టీ జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో సుమారు 50 మంది పార్టీలో చేరారు. వారందరికీ ఆయన కండువా కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు గంగాధర్, లంక శ్రీను, జి.శ్రీను, పూసల బద్రి, నాగదేవర పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో లారెల్‌హై విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న రవికుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో లారెల్ హై గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని డైరెక్టర్ సుంకర రవికుమార్ పేర్కొన్నారు. 58 మంది హాజరైతే 26 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించారన్నారు. 58 మందిలో 15 మంది 90 శాతం పర్సంటేజ్ సాధించారని సెంటర్ హెడ్ గురునాథ్ పేర్కొన్నారు.

టీడీఎస్‌పై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 : ఇటీవల టీడీఎస్ కట్టే విధానంలో మార్పులు వచ్చాయని, దానికి అనుగుణంగా వర్తకులు అవగాహన పెంచుకోవాలని ఇన్‌కం ట్యాక్స్ టీడీఎస్ స్పెషల్ ఆఫీసర్ దేవదత్తం సూచించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో బుధవారం టీడీఎస్ పన్ను చెల్లింపు విధానంపై ఇన్‌కం ట్యాక్సు అధికారులు వర్తకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌కం ట్యాక్స్ అధికారి సత్యనారాయణ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంలోని మార్పుల గురించి తెలిపారు. ప్రముఖ ఆడిటర్లు గోదావరి శ్రీనివాస్, ఏఎల్ నరసింహరావు చట్టంలో వచ్చిన మార్పులను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఛాంబర్ కోశాధికారి బలభద్ర రాజా, జాయింట్ సెక్రటరీ వెచ్చా బాబ్జీ, వర్తకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సైనికులుగా తయారు కావాలి



గైట్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రాజానగరం, ఫిబ్రవరి 14: ప్రతి విద్యార్థి దేశ రక్షణ సైనికులుగా తయారు కావాలని ఆర్మీ మాజీ ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఆడమ్‌రాజు, ఆలీషా, జి.చంద్రశేఖర్ ఆకాంక్షించారు. బ్లాక్ డే సందర్భంగా గైట్ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పుల్వామా అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో సైనికుల జీవితాలు ఎప్పుడు ఎలా ఉంటాయో ఎవరు ఊహించలేరన్నారు. కార్గిల్, శ్రీలంక, ఉల్టా వంటి ప్రమాకర ప్రాంతాల్లో ఎదురైన అనుభవాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.వల్లీమాధవి అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో వీఎన్ కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఉమావిశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



జంబుపట్నంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ దృశ్యం

కోరుకొండ, ఫిబ్రవరి 14: మండలంలోని జంబుపట్నంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం ఉమా సమేత విశ్వేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం ధ్వజస్తంభం, వీరభద్ర విగ్రహ ప్రతిష్ఠ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, విఘ్నేశ్వర స్వామి, నందీశ్వర, చండీశ్వర, కాళ్ళ భైరవ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఏక శుభముహూర్తంలో జరిగింది. అంతకుముందు మండపారాధన, నవగ్రహ హోమాలు, పూర్ణాహుతి జరిగాయి. దేవదాయ ధర్మదాయ శాఖ, టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు దేవాలయ నిర్మాణానికి అందజేశారు. భక్తుల విరాళాలు సుమారు రూ.80 లక్షలతో ఆలయ నిర్మాణం సుందరంగా జరిగింది. ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయక్ష్మి, జక్కంపూడి గణేష్, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ, ఎంపీపీ వల్లి సూర్యకుమారితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలంటూ ఉపాధ్యాయుల నిరసన



ఫరిజెల్లిపేట పాఠశాలలో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం, ఫిబ్రవరి 14: తమకు నిలిచిపోయిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరుతూ మండలంలో ఫరిజెల్లిపేటలోని ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి బుధవారం పాఠశాల ప్రాంగణంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.మణి, ఐకేడీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బిక్కవోలు, ఫిబ్రవరి 14: అనపర్తి గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న అనపర్తి పెన్షనర్ల భవనంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పీవీఎస్. సూర్యనారాయణ తెలిపారు. ఈఅవకాశాన్ని పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులు వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శి గొలుగూరి రామారెడ్డి, ఎంవీ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ధవళేశ్వరంలో జక్కంపూడి విగ్రహావిష్కరణ



జక్కంపూడి విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి వేణు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 14: రాజకీయాలకు అతీతంగా జిల్లాలోని అందరి హృదయాలను గెలుచుకున్న నాయకుడు దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు అని మంత్రి వేణుగోపాల కృష్ణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ వద్ద అభిమానులు నెలకొల్పిన జక్కంపూడి విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ తమ రాజకీయ గురువు జక్కంపూడి విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉంద న్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, గూడూరి శ్రీనివాసరావు.. జక్కంపూడి సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నక్కా రాజబాబు, తడాల చక్రవర్తి, బి.హరిప్రసాద్, తోరాటి ప్రభాకరరావు, మద్దాల అను, ముత్యాల పోసికుమార్, సాధనాల చంద్రశేఖర్, తలారి వరప్రసాద్ పాల్గొన్నారు.

గోకవరం సొసైటీ చైర్మన్‌గా చినబాబు

గోకవరం, ఫిబ్రవరి 14: సొసైటీ ద్వారా రాయితీల రూపంలో రైతులకు అన్ని విధాలా లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తానని సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు అన్నారు. గోకవరం సొసైటీ నూతన చైర్మన్‌గా దాసరి చినబాబు నియమితులైన సందర్భంగా స్థానిక సూర్య ఫంక్షన్ హాల్‌లో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. దీనికి జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సుమారు 3200 మంది సభ్యులు గల ఈ సొసైటీ రూ.10 కోట్ల టర్నోవర్‌తో ప్రస్తుతం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జిల్లా సహకార శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, గుల్లా ఏడుకొండలు, సుంకర వీరబాబు, పాటి రాంబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, రౌతు జోగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడల్లో వీటీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



సంతోశ్‌పాల్‌ని అభినందిస్తున్న కాలేజీ ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన తమ విద్యార్థులను వీటీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజా, అధ్యాపకులు సత్కరించారు. ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న యంగల సంతోష్ పాల్ గుంటూరు జిల్లా నరసా రావుపేటలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో అథ్లెటిక్స్ 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. జాతీయ స్థాయిలో ముంబయిలో జరిగిన అథ్లెటిక్స్‌లోనూ పాల్గొన్నాడు. సంతోష్ తండ్రి సతీశ్ రాజమహేంద్రవరంలోని జైలు డిపార్టు మెంట్‌లో హెడ్ వార్డర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంతోశ్‌తో పాటు ఆదిత్య-వాలీబాల్, శివా జీ-టెన్నిస్, సత్యదేవ్-బాస్కెట్‌బాల్, వంశీ-బాస్కెట్‌బాల్, వీరబాబు-ఫుట్‌బాల్, మహేశ్-త్రోబాల్, 800మీటర్ల హర్డిల్స్‌లో ప్రతిభ చూపిన ఎం.చందును సత్క రించారు. కార్యక్రమంలో పీడీ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయకనక దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ

కడియం, ఫిబ్రవరి 14: మండలంలోని వేమగిరిలో పల్లపువీధిలో విజయ కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు విఘ్నేశ్వరపూజ, పీఠపూజ, నవరత్నాన్యాసము, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభం, గోదృష్టి, అమ్మవారి దర్శనం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. అలాగే కడియం మేకల దిబ్బ ప్రాంతంలో రాధాకృష్ణస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారిని పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

సామూహిక అక్షరాభ్యాసం

కడియం, ఫిబ్రవరి 14: సరస్వతీ జయంతి వసంత పంచమి సందర్భంగా కడియపులంకలోని ముసలమ్మ ఆలయంలోని విద్యా లక్ష్మీగణపతి, జ్ఞానసరస్వతీ అమ్మవార్ల సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం సంతోష్‌శర్మ మంత్రోచ్చారణ మధ్య ఘనంగా జరిగింది. విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి పూజలు చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి వేదాశీర్వచనం అందించారు. విద్యాసామాగ్రిని ఆలయకమిటీ అందించింది.

ధర్మవరంలో కొవ్వొత్తుల ప్రదర్శన



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 14: ఉగ్రవాదుల దాడిలో మరణించిన సీఆర్‌పీఎఫ్ అమర్ల జవాన్ల మృతికి సంతాపంగా మండలంలోని ధర్మవరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జమ్మూ నుంచి కాశ్మీర్‌లో విధులకు వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై పుల్వమా జిల్లాలో లతేపుర (అవంతిపుర) వద్ద 2019 ఫిబ్రవరి 14న ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందగా 30 మందికి పైగా గాయపడ్డారు. దాంతో ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా పాటిస్తున్నారు. ధర్మవరంలో పారా మిలటరీ ఎక్స్ సర్వీస్‌మేన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తాతారావు, రవి, డీవీవీ ప్రసాద్, డి.దామోదరం, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాదేవికి గౌరవ డాక్టరేట్

దేవరపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని కృష్ణంపాలెంలోని బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు జీ శ్యామలాదేవికి గౌరవ డాక్టరేట్ లభించింది. హోప్‌థీలాజికల్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ ఈ నెల 9న శ్యామలాదేవికి డాక్టరేట్ ప్రదానం చేసింది. సామాజిక సేవలో భాగంగా ఆమెకు ఈ డాక్టరేట్ అందజేశారు. బుధవారం వృద్ధాశ్రమంలో విలేఖర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు.











పీకలు కొరికేయడంతో చనిపోయిన కోళ్లు.. ఘటనాస్థలంలో అటవీ అధికారి పరిశీలన.. చనిపోయిన కోళ్లను చూపుతున్న రైతు

బిక్కవోలు ఘటనలపై విచారణకు ఆదేశం

అనపర్తి,ఫిబ్రవరి 14 : బిక్కవోలు మండలంలో ఇటీవల ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ స్పందించింది. విచారణ నిర్వహించి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్వర్తులు జారీ చేసినట్టు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. బదిలీపై వెళ్లినా తిరిగొచ్చి 120 ఇళ్ల పట్టాలపై సంతకాలు చేసిన తహశీల్దార్ పోసిబాబు, మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధుల భర్తలు చేసిన రాజకీయ ప్రసంగాలపైన, ఇళ్ల పట్టాలు పంపిణీకి సొమ్ములు వసూలు చేసిన శానిటరీ సూపర్‌వైజర్‌పైన చర్యలు కోరుతూ చేసిన ఫిర్యాదులపై స్పందించినట్టు తెలిపారు.

రేపు బంద్ విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 : కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న ప్రధాని మోదీ విధానాలను తిప్పికొట్టేందుకే ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ తెలిపారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఐదు వందల రైతు సంఘాలతో ఏర్పడిన సంయుక్త కిసాన్ మోర్చా, మధ్యతరగతి ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఈ నెల 16న బంద్ విజయవంతం చేయాలన్నారు. రాజమహేంద్రవరంలోని గణేష్‌చౌక్ రైతు బజార్, ఆజాద్‌చౌక్, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో బుధవారం కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్లకు రూ. 5 లక్షల కోట్లు అప్పనంగా దోచిపెట్టారని, కార్మికులు, ప్రజలు, ఉద్యోగులు, రైతుల పట్ల తీవ్ర నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికే 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, నాయకులు రాంబాబు, అప్పల నరసయ్య, వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు సప్పా రమణ, నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 3న పల్స్ పోలియో : డీఎంహెచ్‌వో



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 : జిల్లాను పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం అని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు.రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై బుధవారం వైద్యాధికారులు, వైద్యసిబ్బందితో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 1,88,772 మంది ఉన్నారని, వీరందరికీ పోలియో వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. వ్యాక్సిన్ వేయడానికి 4,657 మంది ఆరోగ్యసిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మెంబర్ డాక్టర్ జాన్ జ్యుడే జోసఫ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఎస్.రాజకుమారి పాల్గొన్నారు.



కోరుకొండలో ఆందోళన చేస్తున్న రైతాంగం

కోరుకొండలో రిజిస్ట్రేషన్ల నిలుపుదలపై ధర్నా

కోరుకొండ, ఫిబ్రవరి 14 : కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఈనం భూములంటూ కోరుకొండకు చెందిన భూములు, ఇళ్ళస్థలాలు, ఇళ్ళు గత ఎనిమిదేళ్లుగా క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంపై రైతులు మండిపడ్డారు.వెంటనే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం కోరుకొండ, రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన ధర్నా చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో భూముల రిజిస్ట్రేషన్లకు ఆర్డినెన్స్ తీసుకొచ్చారని అది చట్టరూపం దాల్చేలోపు ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం రావడం జరిగాయన్నారు. ప్రస్తుత వైసీపీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే కోరుకొండ భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించి ఓట్లు అడుగుతామన్నారని.. నాలుగున్నరేళ్లు గడచిపోయినా రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించలేదన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా కోరుకొండలో రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రొంగల శ్రీనివాస్, ఉండ్రు రామారావు చౌదరి, మద్దాల రమణ, పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్

జగనన్న ఇళ్లు ఒక బోగస్

వెలుగుబందలో నిర్మాణాల్లేవ్.. ఆవలో ఇళ్లే లేవు..

టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ - నేడు ధర్నా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: జగనన్న ఇళ్ల ఒక బోగస్ స్కీమ్‌గా తయారైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలుగుబందలో జగనన్న ఇళ్ల పథకంలో 13069 ప్లాట్లు వేస్తున్నట్టు లెక్కలు కట్టారని అందులో 10,081 ప్లాట్లు ఇస్తే నివాసయోగ్యంకాక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చివరికి అక్కడ కేవలం 100 మంది మాత్రమే శ్లాబులు వేసుకున్నారని చెప్పారు. జగనన్న ఇళ్ల స్కీమ్ పేరుతో రూ. లక్షా 80 వేలు మాత్రమే కేటాయించి మిగిలినవి లబ్ధిదారులు పెట్టుకుని త్వరగా ఇల్లు పూర్తి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇల్లు పూర్తి కావాలంటే రూ.10లక్షలు ఖర్చవుతుందన్నారు. ఇల్లు పూర్తి చేసుకోకపోతే సంక్షేమ పథకాలు కట్ చేస్తామని బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. దీనిపై నా దృష్టికి వస్తే కమిషనర్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఇక బూరుగుపూడి ఆవలో తాడిచెట్లులోతులో ఉన్న నీటిలో ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయింపులు చేశారని చెప్పారు. కోర్టు అనుమతించినా ఇప్పటికి ఒక ఇల్లు కూడా కట్టలేదన్నారు. 25 శాతం కమీషన్ కోసం ఎంపీ ఆవ భూములు కేటాయించారని ఆరోపించారు. ప్రజలను మోసం చేసిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు ధర్నా చేస్తున్నట్టు ప్రకటించారు. సమావేశంలో జనసేన నగర అధ్యక్షుడు వై . శ్రీను, టీడీపీ మాజీ కార్పొరేటర్లు యిన్నమూరి రాంబాబు, మొకమాటి సత్యనారాయణ, కోరుమిల్లి విజయశేఖర్, ద్వారా పార్వతి సుందరి, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు,నల్లం శ్రీను, రొబ్బి విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంపింది పులా? పిల్లా!?

- 20 కోళ్ల పీకలు కొరికి రక్తం తాగిన జంతువు
- వైల్డ్ క్యాట్ దాడిచేసిందంటున్న అధికారులు
- చీపురుగూడెంలో ఘటన

నల్లజర్ల,ఫిబ్రవరి 14 : గుర్తు తెలియని జంతువుల దాడిలో 12 పందెం పుంజులు,8 కోడి పిల్లలు మృత్యువాత పడ్డాయి.నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన పిన్నమని దుర్గారావు చీపురుగూడెంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని నాటు కోళ్ల పెంపకం ప్రారంభించాడు. చుట్టు నెట్ కట్టి అందులో 50 కోళ్ల వరకు పెంచుతున్నాడు. ప్రతి రోజూ రాత్రి సమయంలో కోళ్లను చూసుకుని వెళ్లే అలవాటు ఉన్న రైతు దుర్గారావు మంగళవారం రాత్రి 11 గంటలకు కోళ్ళ వద్దకు వెళ్లి చూడగా కొన్ని కొన ఊపిరితో కొట్టుకుంటున్నాయి.కొన్ని కోళ్ల మృత్యువాత పడ్డాయి. ఇటీవల ఇక్కడి నుంచి వెళ్లిపోయిన పులి మళ్లీ వచ్చి ఉంటుందని కంగారుపడిన రైతులు ఫారెస్ట్ అధికారులకు ఫోన్ సమాచా రం అందించారు. ఈ మేరకు బుధవారం ఉదయం చీపురుగూడెం వచ్చిన ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్ వారి సిబ్బంది పాదముదలు సేకరించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పాదముద్రలు పులి,చిరుత పులివి కావని నిర్ధారణకు వచ్చి అడవి జంతువులు కోళ్ళపై దాడి చేయలేదని చెప్పారు.పశు వైద్య శాఖ ఏడీఏ మోజేష్ తన బృందంతో మృతిచెందిన కోళ్ళను పరిశీలించారు. కేవలం తలపై మాత్రమే దాడి చేసి రక్తం పీల్చి ఉండడంతో పొలంలో ఉన్న పెద్ద సైజు జంగు పిల్లులు,బావుర పిల్లులు (వైల్డ్ క్యాట్) వంటి జాతులు మాత్రమే రక్తం పీల్చి చంపి ఉంటాయని అంచనా వేశారు. 20 కోళ్ల మృత్యువాత పడడం ద్వారా సుమారు 3 లక్షల నష్టం వచ్చినట్టు రైతు దుర్గారావు తెలిపాడు. రెండు పందెం పుంజులు (డాబర్)రెండు లక్షలు విలువ ఉంటుందన్నారు.మొన్నటి వరకు చీపురుగూడెం ఫారెస్ట్‌లో పెద్ద పులి సంచరించి ప్రజలను,రైతులు,రైతు కూలీలను భయందోళనకు గురి చేస్తే ప్రస్తుతం వైల్డ్ క్యాట్ దాడి వల్ల రైతులు మరింత భయపడుతున్నారు . ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతు వేడుకుంటున్నాడు.

యుద్ధానికి సంసిద్ధం!

ఉద్యోగుల.. ఉద్యమబాట



రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రి వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన

- సర్కారుపై నిరసన గళం
- ఉద్యమించిన ఉద్యోగులు
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు
- 4 రోజుల పాటు నిరసనలు
- డిమాండ్ల సాధనకు పోరాటం
- 27న చలో విజయవాడ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : సర్కారు తీరుపై ప్రభుత్వ ఉద్యోగులు యుద్ధానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వ తీరు కారణంగా నిన్నటి వరకూ బయటకు రావడానికే భయపడిన ఉద్యోగులు తమ నిరసన గళం వినిపిస్తున్నారు. హామీల చిట్టా విప్పి.. డిమాండ్ల సాధన పోరాడుతున్నారు. ఏపీఎన్జీవో అసోసియేషన్ పిలుపు మేరకు నాలుగు రోజుల పాటు నిరసన తెలియజేయనున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో బుధవారం ఉద్యోగ ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దార్ల ఐక్యకార్యాచరణ(ఏపీ జేఏసీ) కమిటీ పిలుపుమేరకు అందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆయా కార్యాలయ గేట్ల వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి జేఏసీ ఉద్యమ శంఖారావం పేరిట పోరాటబాట చేపట్టిన సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం సిటీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు.అనంతరం తమ సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ కేంద్రాల్లో ఆర్డీవో,మండల కేంద్రాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, డైలీఅండ్ ఫుల్‌టైం పని చేస్తున్నారు. ఆయా ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై నినదించారు. 12వ పీఆర్సీ కమిషన్ వేసినప్పటికీ ఏ మాత్రం ప్రగతి లేదని మండిపడ్డారు. గతేడాది జూలై 1 నుంచి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉన్నా నేటికీ అతీగతీలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరల నేపథ్యంలో తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు తమ సొంత డబ్బును వాటాగా కడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, పార్ట్ ఫైనాన్స్ కోసం చేసుకున్న దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని వాపోయారు. సరెండర్ లీవు, ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయిం బర్స్‌మెంట్, 11వ పీఆర్సీ, ఉద్యోగుల టీఏ, డీఏ బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని అందులో వివరించారు. తక్షణమే రూ.25 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించే విషయంలోనూ స్పష్టత లేదని, ఎన్ఎం ఆర్, పార్ట్‌టైం, ఫుల్‌టైం ,ఔట్‌సోర్సింగ్,ఎంటీఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయులుగా నియామకమైన వారందరినీ క్రమబద్ధీకరించా లని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లతో జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు..నిరసనలతో హోరెత్తించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ జేఏసీ డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరం జీజీహెచ్, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తమ నిరసన తెలియజేశారు. ఏపీ జేఏసీ నగర సంఘం అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వేణుమాధవ్ మాట్లాడుతూ ఏపీ జేఏసీ రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మిక, పెన్షనర్లను కోరుతున్నామన్నారు. జేఏసీ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.షరీఫ్, పింఛనుదారుల సంఘం నాయకులు కేకే సంజీవరావు, పార్వతి, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, వెంకటరమణ, నగర ఎన్జీవో సంఘం నాయకులు అనిల్‌కుమార్, ప్రతాప్, రాజశేఖర్, శాంతిసాగర్, ఆనంద్, వివిధశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోరు ఇలా..

తాళ్ళపూడి, ఫిబ్రవరి 14 : గురువారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తారని ఏపీ జేఏసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరు కావాలని మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో తమ నిరసనలు తెలియజేయాలన్నారు. 17వ తేదీన తహశీల్దార్ కార్యలయాల వద్ద ధర్నా చేయాలని, 20వ తేదీన కలెక్టరేట్ వద్ద ర్యాలీ, ధర్నా చేయాలన్నారు. 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ రాష్ట్ర నాయకులు జిల్లాల పర్యటన చేస్తారని 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్యమ కార్యా చరణ కమిటీ ప్రకటించిందని తెలిపారు.



రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

హంగు.. ఆర్భాటమే!

చేసింది కొంతే.. చెప్పేది కొండంత



అధ్వానంగా డ్రెయినేజీ

- నగరంలో అటకెక్కిన అభివృద్ధి
- ఐదేళ్లుగా సమస్యలపై దృష్టి లేదు..
- అంచనాలు రూ.350 కోట్లు
- సీఎం హామీ రూ.125 కోట్లు
- ఇచ్చింది రూ. 20 కోట్లు
- ఖర్చు చేసింది రూ.70 కోట్లే?
- సాధారణ నిధులతో అభివృద్ధి
- మిగిలిన రూ.280 కోట్లేవి
- వైసీపీ నాయకుల డబ్బా

రాజమహేంద్రవరం సిటీ,ఫిబ్రవరి 14 : గతంలో ఎన్నడు లేనివిధంగా అభివృద్ధి చేశాం.. కావాంటే చూసుకోండి అంటూ గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీ నాయకుల అంచనాలు కొండలు దాటితే వాస్తవికతకు చాలా భిన్నంగా ఉందనే లెక్కలు చెబుతున్నాయి.రాజమహేంద్రవరం అభివృద్ధికి చాలా కష్టపడ్డామని వైసీపీ నాయకులు చెబుతున్నా అలా ఎందుకు అంటున్నారో జనానికి అర్థం కావడంలేదు. ఎందుకంటే అసలుది వదిలేసి.. కొసరుది పట్టుకుని అభివృద్ధి చేశాం..అభివృద్ధి చేశాం అంటే ఎవరు మాత్రం హర్షిస్తారు.. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో వైసీపీ నాయకులు చేస్తున్నది ఆదే.. చేసింది కొంతే.. చెప్పేది మాత్రం కొండంత..

సమస్యలివీ..

చారిత్రక రాజమహేంద్రవరాన్ని పట్టిపీడిస్తున్న డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, గోదావరి కాలుష్యం తదితర సమస్యలకు శాశ్వతం పరిష్కారం లభించలేదనే చెప్పవచ్చు. అందుకు జరిగిన ప్రయత్నాలు అన్ని మధ్యలోనే ఆగిపోయాయి. ఇక రాజమహేంద్రవరం అభివృద్ధి అంటే కంబాల చెరువు పార్కు, బ్యూటిఫికేషన్,లైటింగ్, సాయంత్రం వేళలో సేదతీరేవిధంగా వాతావరణం సృష్టించడం కాదు. నగరం లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్యను పరిష్కరించడం. అంతే కాకుండా నగరాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య డంపింగ్ యార్డ్.. రోజువారి వచ్చే చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి.దీంతో నగరంలో దోమలు, పందులు విజృంభిస్తున్నాయి. కొన్నిప్రాంతాల్లో లెట్రిన్ అవుట్‌లెట్లను నేరుగా మేజర్ డ్రైనేజీలకు కలిపివేసిన సమస్యలు పెద్దవనే చెప్పాలి. కానీ అవేమీ పాలకులు పరిగణనలోకి పెద్దగా తీసుకోకపోవడం రాజమహేంద్రవరానికి శాపంగా పరిణమించింది.

హంగుకే రూ.100 కోట్లు ..

రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో గడచిన నాలుగున్నరేళ్లలో సుమారు రూ.300 కోట్ల పనులకు అంచనాలు వేశారు. కానీ గొప్పవిషయం ఏమిటంటే కనీసం రూ.100 కోట్ల రూపాయల పనులు కూడా పూర్తి చేయలేకపోయారు. రాజమహేంద్రవరానికి సీఎం జగన్ ప్రత్యేక గ్రాంట్ రూ.125 కోట్లు ఇచ్చారని చెబుతున్న ప్రజాప్రతినిధి అసలు ఎంత నిధి వచ్చిందో చెప్పరు.. ఎందుకంటే కేవలం వచ్చింది రూ.20 కోట్లు మాత్రమే. అందులో రూ.18 కోట్లు బిల్లులు అయిపోయాయి. మిగిలింది దైవాదీనం.. నగరంలో ఇప్పటి వరకు జరిగిన పనులు చూస్తే డ్రైనేజీలకు సుమారు రూ.20 కోట్లు, సీసీ రోడ్లకు రూ.15 కోట్లు, కంబాచెరువు ఆధునీకరణకు రూ.13 కోట్లు కేటాయించగా ఇప్పటికి సుమారు రూ.7 కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. సుబ్రహ్మణ్యదానంలో ఓపెన్ థియేటర్ ఆడిటోరియం వగైరా పనులకు మంజూరు చేసింది రూ.5 కోట్లు ఇప్పటి వరకూ ఖర్చుచేసింది రూ.2 కోట్లు మిగిలిన పనులు చేయాల్సి ఉంది. మొత్తం నాలుగున్నరేళ్ళలో సుమారు రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్ల మధ్య మాత్రమే పనులు జరిగినట్టు ప్రాథమిక అంచనా. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిలో 70 శాతం కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చుచేసినవే.మరి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు అంటూ డబ్బాలు కొడుతున్న వారు రేపు ప్రజలకేం సమాధానం చెబుతారో చూడాలి.

మసిపూసి మారేడుకాయ..

ప్రజల జీవనానికి అవసరమైన వాటికి తొలిప్రాధాన్యత ఇచ్చాక అటుపై హంగులు ఆర్భాటాలు వంటివి గత ప్రభుత్వాలు చేసేవి.. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం కాస్త భిన్నం.. ఏం చేసినా పైకి కనిపించాలి.. అంతే దాని ఉపయోగం ఎంత అనేది ఆలోచించరు. అందుకే ముందు హంగులు ఆర్భాటలు చేసింది.. నగరంలో దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్న మురుగునీటి పారుదల సమస్య, నల్లచానల్ గుండా నేరుగా గోదావరిలో కలుస్తున్న మురుగు, , పేపరుమిల్లు కాలుష్యం, గోదావరి కలుషితం, క్వారీ ప్రాంతంలో గోతుల్లో పడి అనేక మంది మృత్యువాత పడుతున్న సమస్య, పందులు, దోమలు, డెడికేటెడ్ చానల్ నిర్మాణం, నగరంలో పారిశుద్యకార్మికుల కొరత, 24 గంటల సురక్షిత మంచి నీటి సమస్య, శీలం నూకరాజు కాంప్లెక్స్ రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, జాంపేట ఉమారామ లింగేశ్వర కల్యాణ మండపం రోడ్డు, మెయిన్ రైల్వే స్టేషన్ రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. ఇలా అనేక సమస్యలతో రాజమహేంద్రవరం సతమతమౌతోంది. తనను బాగుచేసే ప్రభుత్వం, ప్రజాప్రతినిధి కోసం ఎదురుచూస్తుందనే చెప్పవచ్చు. వైసీపీ నాయకులకు ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల పుణ్యకాలం కాస్త అయిపోయింది. ఇప్పుడు కొన్ని చోట్ల రాత్రికి రాత్రే మసిబూసి మారేడు కాయ చేసే పనులు పాలకులు చేయడం విడ్డూరంగా ఉంది.



అసంపూర్తిగా నిలిపివేసిన రోడ్డు నిర్మాణ పనులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు...



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రాగూర్ చిత్రంలో నాయకులు

కాంగ్రెస్‌ను హైజాక్ చేసిన జగన్

కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రాగూర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను జగన్ రెడ్డి హైజాక్ చేయడంతో ఆంధ్రాలో పార్టీ దెబ్బతిందని ఆ పార్టీ ఏపి వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రాగూర్ అన్నారు. రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి వీక్ చేశాడన్నారు. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షురాలిగా నియమితులైన వైఎస్ఆర్ కుమార్తె షర్మిళారెడ్డి ఆంధ్రాలో కాంగ్రెస్‌కు పునర్జీవం పోశారన్నారు. ఇప్పుడు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసుకుంటున్నామని చెప్పారు. 2024 ఎన్నికల్లో యుద్ధానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాం గ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగుతున్నారని ఇప్పటికి 1200 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ నెల 29న జాబితా ఫైనల్ చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం సీడబ్ల్యూసీ సభ్యుడు రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆంధ్రాలోను నాలుగు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో గిడుగు రుద్రరాజు, సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ,రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, ముళ్ళ మాధవ్, తాళ్ళూరి విజయకుమార్,మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభిప్రాయాల సేకరణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో ఛాంబర్, రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు మాత్రమే ఫారం 7 స్వీకరించడం జరుగుతుందన్నారు.సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెండు బయో గ్యాస్ ప్లాంట్స్ : కలెక్టర్

కొవ్వూరు, ఫిబ్రవరి 14 : కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో 36 ఎకరాల్లో 43 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో 256 కోట్ల పెట్టుబడితో 270 మందికి ఉపాధి ఇచ్చేలా రెండు బయో ప్లాంట్స్ యూనిట్స్ నెలకొల్పనున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. కాపవరం గ్రామంలో రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించి శిలాఫలకాన్ని బుధవారం మంత్రి గుడివాడ అమర్నాథ్ వెలగపూడి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ తొలిదశలో 1024 కోట్ల పెట్టుబడితో 1080 మందికి ఉపాధి లక్ష్యంగా 8 కంప్రెస్‌డ్ బయో గ్యాస్ ప్లాంట్‌లు నెలకొల్పనుందన్నారు. కొవ్వూరు మండలం కాపవరం, దొమ్మేరు గ్రామాల్లో రెండు బయో ప్లాంట్స్ యూనిట్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీ ప్రతినిధులు మాట్లాడుతూ ఆరు నెలల్లో ఉత్పత్తి రావడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, సంక్షేమశాఖ అధికారులు కె.ఎస్.జ్యోతి, ఎం.సందీప్, రిలయన్స్ బయో ఎనర్జి ప్రతినిధులు జి.కృష్ణకుమార్, ఎం.సుధీర్, ఆర్.మంజ్రేకర్ రెడ్డి పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం


మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

కొవ్వూరు, ఫిబ్రవరి 14: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పోలీసు అధికారులతో లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అదాలత్‌లో అత్యధిక కేసులు రాజీ అయ్యే విధంగా సహకరించాలన్నారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, బ్యాంకు బకాయి, మనోవర్తి, గృహహింస, వాహన ప్రమాద కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చునన్నారు. అలాగే ప్రీ లిటిగేషన్, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మారావు, 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ, సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

21,960 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

కొవ్వూరు, ఫిబ్రవరి 14: అక్రమంగా తరలిస్తున్న 21,960 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సివిల్ సప్లయిస్ డీటీ గొలుగూరి బాపిరాజు తెలిపారు. రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో తమకు వచ్చిన సమాచారంతో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టామని, బుధవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో నల్లజర్ల శ్రీరామచంద్ర రవ్వమిల్లు నుంచి యానాం వెళ్తున్న లారీలో రేషన్‌బియ్యం గుర్తించారు. లారీలో ఉన్న 21,960 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకుని నిడదవోలు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. బియ్యం విలువ రూ.9,22,320, ఉంటుందని, బియ్యం, లారీని స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశామన్నారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కం ఓనర్ వంకా వీరవెంకట సత్యనారాయణను అదుపులోకి తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేయాలని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాపిరాజు తెలిపారు.

సాయిబాబాకు ఏకాదశ రుద్రాభిషేకాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 14: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సాయిబాబా ఆలయంలో షిరిడి సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయినాథ్ విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం బాబాకు ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం సంపూర్ణ భగవద్గీత పారాయణం, రేడియో, టీవీ ఆర్టిస్ట్ పురాణం విజయలక్ష్మి శ్రీరామసుగ్రీవ మైత్రిపై హరికథ ప్రవచనం అందజేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీదేవి ఆలయంలో శ్రీ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయార్చకులు విద్యార్థుల జ్ఞానాభివృద్ధికి పూజలు చేశారు. అమ్మవారిని తేనేతో అభిషేకించారు.

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో శివజ్యోతి

నల్లజర్ల, ఫిబ్రవరి 14: తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు సమష్టి కృషి చేయాలని, ఓటర్ల నమోదు, సవరణ కోసం అందించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు బీఎల్వోలు క్షేత్ర స్థాయి విచారణ చేయాలని గోపాలపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి లక్ష్మీ శివజ్యోతి సూచించారు.మండలం పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం సచివాలయ సిబ్బంది,బీఎల్వోలతో ఆమె సమావేశమయ్యారు. తుది జాబితా విడుదలైన తర్వాత స్వీకరించిన దరఖాస్తులపై సమీక్షించారు. ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలని, సెక్టారు అధికారులు, సూపర్‌వైజర్లకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణారావు, డీటీ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ధనమ్మతల్లి ఆలయ ముఖద్వారం ప్రారంభం

తాళ్లపూడి, ఫిబ్రవరి 14: మండలంలోని వేగేశ్వరపురంలో ధనమ్మతల్లి ఆలయానికి వెళ్లే దారిలో ముఖద్వార మండపం ఏర్పాటు చేశారు. దానిని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు బుధవాం ప్రారంభించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో సింహాద్రి జనార్దన్, యెల్లిన శివరామకృష్ణ, సూలా పోసియ్య, మద్దుకూరి రాంబాబుతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిడదవోలులో రామాలయానికి శంకుస్థాపన

నిడదవోలు, ఫిబ్రవరి 14: నిడదవోలులోని ఎస్టీ కాలనీలో బుధవారం కోదండ రామాలయం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి ప్రతినిధులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

గోపాలపురం, ఫిబ్రవరి 14: ప్రతి కార్యకర్తకు అండగా మేమున్నామన్న భరోసా కల్పించిన పార్టీ జనసేన అని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త రాజు కాలికి ఇటీవల ప్రమాదవశాత్తూ తీవ్రగాయమైంది. దీంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో రాజు కుటుంబానికి ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులను సువర్ణరాజు బుధవారం అందజేశారు. తమ అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోసిన గణపతి, గొర్రెల ఫణేంద్ర, కృష్ణబాబు, వీరకృష్ణ, రాజేష్, సీతారామ్, మణికంఠ, సర్వారాయుడు పాల్గొన్నారు.

టీడీపీని విమర్శించే అర్హత నిడదవోలు ఎమ్మెల్యేకు లేదు

తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 14: టీడీపీని, మాజీ ఎమ్మెల్యే శేషారావును, నాయకులను విమర్శించే అర్హత ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడుకు లేదని టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ అన్నారు. బుధవారం ఉండ్రాజవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ఇటీవల జరిగిన ఆసరా సమావేశంలో మాట్లాడిన తీరును ఆయన ఖండించారు. నాలుగున్నరేళ్లు కాలయాపన చేసి నోటిఫికేషన్ వచ్చే ఈ రెండుమూడు నెలలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, అభివృద్ధి ఇప్పుడే గుర్తొచ్చిందా అని విమర్శించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు కొవిడ్ టైమ్‌లో ఎంతో సేవ చేశారని, వారిపై ప్రభుత్వం కేసులు పెట్టడం దారుణమన్నారు. ఏపీ ప్రజలు రివర్స్ బటన్ నొక్కే స్థితిలో ఉన్నారని రామకృష్ణ పేర్కొన్నారు. పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు రాచమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ కొవిడ్ సమయంలో శేషారావు ఎంతో సేవ చేశారని, మీరు ఆ రెండు నెలలు ఎక్కడున్నారో నియోజకవర్గ ప్రజలకు తెలుసునని చెప్పారు.

కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు

గోపాలపురం, ఫిబ్రవరి 14: కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను బుధవారం సాగిపాడు లెప్రసీకాలనీలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా 20మంది వ్యాధిగ్రస్థులకు ఆహార పొట్లాలతో పాటు పండ్లు అందజేశారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొవ్వూరు కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, ఫిబ్రవరి 14: కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో పట్టణంలోని 23 వార్డుల్లో చేపట్టిన, చేపట్టబోయే వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

రేపు బంద్ విజయవంతం చేయాలి

» పలు కార్మిక సంఘాల నాయకులు.. కరపత్రాల ఆవిష్కరణ

కొవ్వూరు, ఫిబ్రవరి 14: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్త పారిశ్రామిక, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో బుధవారం బంద్ కరపత్రాన్ని ఆవిష్కరించి, ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే మస్తాన్, ఐఎఫ్‌టీయూ నాయకుడు సీహెచ్ రమేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశాన్ని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తోందని, విశాఖ ఉక్కు సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటు పరం చేయడానికి పూనుకుందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పి.నాగేశ్వరరావు, క్రషర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంటా కృష్ణ, దుర్గారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: దొండపూడి సెంటర్‌లో ఏపీ రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెండు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతాంగం పండించే అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని, రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 16న సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. కార్మిక, కర్షక ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



గోపాలపురం: దొండపూడిలో ప్రదర్శన చేస్తున్న రైతు కూలీ సంఘం



కొవ్వూరులో కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మోటారు వాహనాల చట్టం-2019ని రద్దు చేయాలి

నిడదవోలు, ఫిబ్రవరి 14: డ్రైవర్లకు ఉరితాడులా మారిన క్రిమినల్ చట్ట నిబంధనలపై డ్రైవర్లందరూ ఐక్యంగా పోరాడాలని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. బుధవారం నిడదవోలులో మోటారు వాహనాల చట్టం-2019ని రద్దు చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 16న దేశ వ్యాప్త నిరసనలను లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ ట్యాక్సీ ఓనర్స్ అండ్ వర్కర్స్ జయప్రదం చేయాలన్నారు. ఆ రోజు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటరులో నిర్వహించే నిరసన కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జుజ్జువరపు రామారావు, బాలాస్వామి, పి.సత్తిబాబు, ఎల్లే కృష్ణంరాజు తదితర్లు పాల్గొన్నారు.



నిడదవోలులో కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

» ప్రభుత్వోద్యోగుల జేఏసీ చైర్మన్ నందీశ్వరుడు



నిడదవోలు డీటీకి వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు

నిడదవోలు/గోపాలపురం, ఫిబ్రవరి 14: ప్రభుత్వం ప్రభుత్వోద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే నెల 5వ తేదీ నుంచి సమ్మె చేస్తామని ప్రభుత్వోద్యోగుల జేఏసీ చైర్మన్ కె.నందీశ్వరుడు అన్నారు. బుధవారం నిడదవోలులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీని అమలు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వోద్యోగులు, టీచర్లు రిటైర్ ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు దశల వారీ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వం దిగిరాని పక్షంలో వచ్చేనెల 5 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. జేఏసీ సంఘాలతో జరిగిన సమావేశంలో నిర్దిష్ట ఆదేశాలతో కూడిన విషయాలు లేకుండా హామీలతోనే సరిపెట్టడం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను ప్రభుత్వం మోసగించడమేనన్నారు. అనంతరం డీటీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె.జయంత్, జి.రాంబాబు, కళ్యాణ్‌కృష్ణ, ఎమ్.సురేష్, తరుణ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే గోపాలపురంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ కన్వీనర్ వెంకట్, ఎస్.వెంకటరమణ, వీర్రాజు, ఏ.జాన్‌బాబు, నాగేశ్వరరావు, దోసయ్య, వెంకటేష్, వెంకటేశ్వరరావు, ఎన్‌సీహెచ్ రత్నకుమారి పాల్గొన్నారు.



గోపాలపురంలో వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు

వెన్న లేకుండానే.. నెయ్యి తయారీ

» విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, మెట్రాలజీ సంయుక్త దాడులు

» పాలమూరులో రూ.7 లక్షల ముడి సరుకు సీజ్

» స్వీట్స్ తయారీ అనుమతులతో కల్తీ నెయ్యి తయారీ



కెమికల్స్ కలిపేందుకు సిద్ధంగా ఉంచిన కల్తీ నెయ్యి

అనపర్తి, ఫిబ్రవరి 14: మార్కెట్‌లో లభించే ఏ సరుకు కొనాలో, ఏది అసలో ఏది నకిలీనో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మార్కెట్‌లో లభించే నెయ్యి కొంత తక్కువ ధరకు విక్రయించేందుకు ఒక వ్యాపారి నకిలీని ఎన్నుకున్నాడు. వెన్న లేకుండానే టన్నుల నెయ్యిని తయారు చేసి విక్రయాలు సాగిస్తున్నాడు. అనపర్తి మండలం పొలమూరులో వరి పొలాలకు ఆనుకుని గ్రామానికి చెందిన తమలంపూడి రాజారెడ్డి స్వీట్స్ తయారీ పేరుతో కార్ఖానా ఏర్పాటు చేసి రెండేళ్లుగా నకిలీ నెయ్యి తయారు చేస్తూ విక్రయాలు సాగిస్తున్నాడు. తయారు చేసిన కొంత భాగాన్ని ఒరిస్సాకు తరలిస్తుండగా కొంత భాగాన్ని ఇక్కడ రిటైల్ మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. మార్కెట్‌లో లభ్యమైన నకిలీ నెయ్యి డబ్బాపై ఎటువంటి నిర్దిష్టమైన ప్రచురణలు లేకపోవడంతో విజిలెన్స్ అధికారులు తయారీ కేంద్రంపై దృష్టి సారించారు. బుధవారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సన్‌ఫ్లవర్ ఆయిల్, వనస్పతి, పామాయిల్, జాబిలాల సీడ్స్, ఆర్టిఫిషియల్ ఫ్లేవర్‌తో దనేశ్వరి బ్రాండ్‌పై నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్టు గుర్తించారు. నకిలీ నెయ్యి తయారీకి వినియోగించే సుమారు రూ.7 లక్షల విలువైన ముడి సరుకును సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ముత్యాలనాయుడు మాట్లాడుతూ నకిలీ నెయ్యి తయారీ చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. స్వీట్ తయారీ పేరుతో అనుమతులు తీసుకుని నకిలీ నెయ్యి తయారు చేస్తున్నట్లు గుర్తించామని, సుమారు టన్ను నకిలీ నెయ్యి స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్ధి పేరుతో నకిలీ నెయ్యి తయారు చేస్తున్న రాజారెడ్డిపై కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. తయారీ కేంద్రంలో సేకరించిన శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు తరలిస్తున్నామని నివేదిక ప్రకారం క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శ్యామ్యూల్ రాజు మాట్లాడుతూ ప్యాకింగ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కాటాపై సీల్, ప్యాకింగ్‌పై కస్టమర్ కేర్ నెంబరు ముద్రించి ఉండాలని ఈ మూడు నిబంధనలను పాటించక పోవడంతో మూడు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ నాగేంద్రకుమార్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, డీటీ శశిధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

శ్యామలాదేవికి గౌరవ డాక్టరేట్



దేవరపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని కృష్ణంపాలెంలోని బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు జీ శ్యామలాదేవికి గౌరవ డాక్టరేట్ లభించింది. హోప్‌థీలాజికల్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ ఈ నెల 9న శ్యామలాదేవికి డాక్టరేట్ ప్రదానం చేసింది. సామాజిక సేవలో భాగంగా ఆమెకు ఈ డాక్టరేట్ అందజేశారు. బుధవారం కృష్ణంపాలెం వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో శ్యామలాదేవి మాట్లాడుతూ 2015లో తాను వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి వృద్ధులకు, అనాథలకు, దివ్యాంగులకు వసతి కల్పించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు అభినందించారు.

సాయినాథుడి ఆలయంలో సరస్వతి పూజ

దేవరపల్లి, ఫిబ్రవరి 14: షిరిడి సాయినాథ ఆలయంలో బుధవారం సరస్వతి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు సరస్వతిదేవికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు చేసి విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులకు పల్లంట్లకు చెందిన మానవత అధ్యక్షుడు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు పెన్నులు, పుస్తకాలు, పలకలు, అట్టలు, అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాశీవిశ్వనాథం, వెంకటేశ్వరరావు, తీగల నారాయణమ్మ పాల్గొన్నారు.

భాష్యంలో ఇంటర్ జోనల్ క్రీడాపోటీలు

దేవరపల్లి, ఫిబ్రవరి 14: దేవరపల్లిలోని భాష్యం స్కూల్‌లో బుధవారం ఇంటర్ జోనల్ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో నల్లజర్ల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, దేవరపల్లి భాష్యం స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మాజీ శ్యాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ క్రీడలు ప్రారంభించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, సృజనాత్మకత పెంపొం దుతుందన్నారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్‌ఛార్జ్ జీఎస్.సత్యనారా యణ, ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు, షేక్ సభాన, వ్యాయమ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గౌడీయ మఠంలో ప్రత్యేక హోమాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 14: త్రిదండి స్వామిజీ శ్రీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు ద్వితీయ వార్షిక విరహ ఉత్సవాల సందర్భంగా కొవ్వూరు గౌడీయమఠం స్వామిజీ విబుధ వామన మహరాజు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. బుధవారం కొవ్వూరు లాంచీల రేవు వద్ద శ్రీ రామానంద గౌడీయామఠంలో దామోదర మహారాజుల తిరోభావం/కృష్ణ వసంత పంచమి, శ్రీవిష్ణుప్రియాదేవి ఆవిర్భావం, శ్రీల పుండరీక విద్యానిధి, శ్రీల రఘునందన ఠాకూరుల ఆవిర్భావాల సందర్భంగా ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. రాధాకృష్ణులకు ప్రత్యేకపూజలు, భోగ హారతులిచ్చారు.

తహశీల్దార్ రవీంద్రనాథ్‌కు సత్కారం

గోపాలపురం, ఫిబ్రవరి 14: ఎన్నికల బదిలీల్లో భాగంగా గోపాలపురం తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై కె.గంగవరం వెళ్లిన రవీంద్రనాథ్‌ను రెవెన్యూ సిబ్బంది బుధవారం సాయంత్రం సత్కరించారు. ఈ సందర్భంగా పూలమా లలతో సత్కరించారు. ఈ సందర్భంగా తనకు సహకారం అందించిన డీటీలు, వీఆర్వోలు క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాహసీల్దార్ ఎస్.కృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి

ఐదు జిల్లాల ముఖ్యనేతలతో మాణిక్ ఠాగూర్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఐదు జిల్లాల ముఖ్యనేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14: అందరు ఐక్యతతో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, ఎంపీ మాణిక్ ఠాగూర్ సూచించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, ఏలూరు, అమలాపురం జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులతో రాజమహేంద్రవరం పేపరుమిల్లు సమీపంలోని కృష్ణసాయి కల్యాణ మండపంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికలకు బూత్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసుకోవడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికలకు పార్టీ కేడర్ అంతా సిద్ధం కావాలని సూచించారు. ఏఐసీసీ సెక్రటరీ సీడీ మియ్యప్ప, ఏఐసీసీ శాశ్వత సభ్యుడు, పీసీపీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ముళ్ళ మాధవ్, నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, అనపర్తి ఇన్‌చార్జి వడయార్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు కామర ప్రభాకరరావు , కాకినాడ జిల్లా అధ్యక్షులు పాం దురంగారావు, నర్సాపురం అధ్యక్షుడు నార్నిడి బాబ్జి , ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ

రాజమహేంద్రవరం ఇన్‌చార్జి బోడా వెంకట్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్‌ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. నగరంలో ఇటీవల నిర్వహించిన ఒక కార్యక్రమానికి సంబంధించి అంశం అక్కడ లేవనెత్తడంతో బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్ కు మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ సంఘటనలో బాలేపల్లి మురళీధర్ దవడకు గాయం కావడంతో వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు వైద్యచికిత్స అందించారు. తనపై బోడా వెంకట్ దాడి చేశాడని బాలేపల్లి మురళీధర్ ప్రభుత్వాసుపత్రి అవుట్ పోస్టులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత 40 ఏళ్ళుగా కాంగ్రెస్ పార్టీలో సేవలు అందిస్తున్నానని సొంత డబ్బులు ఖర్చుచేసుకుని పని చేస్తున్నానని బాలేపల్లి చెప్పారు. నగరంలో ఏది జరిగినా తన ఇష్టప్రకారమే జరగాలని బోడా వెంకట్ అనుకోవడం తప్పు అన్నారు. తనపై అతను దాడి చేస్తే కాంగ్రెస్ నాయకులు ఎవ్వరు దానిని ఖండించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా వుండగా బాలేపల్లి అంటే తనకు గౌరవం ఉందని తనపై పరుషపదజాలంతో హద్దులు మీరి మాట్లాడితే ఎలా సహిస్తామని బోడా వెంకట్ అం టున్నారు. ఈ సంఘటనపై కాంగ్రెస్ అధినాయకత్వం సీరియస్ అయ్యింది.

ధర్మవరంలో కొవ్వొత్తుల ప్రదర్శన



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 14: ఉగ్రవాదుల దాడిలో మరణించిన సీఆర్‌పీఎఫ్ అమర్ల జవాన్ల మృతికి సంతాపంగా మండలంలోని ధర్మవరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జమ్మూ నుంచి కాశ్మీర్‌లో విధులకు వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై పుల్వామా జిల్లాలో లతేపుర (అవంతిపుర) వద్ద 2019 ఫిబ్రవరి 14న ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందగా 30 మందికి పైగా గాయపడ్డారు. దాంతో ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా పాటిస్తున్నారు. ధర్మవరంలో పారా మిలటరీ ఎక్స్ సర్వీస్‌మేన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అంబేడ్కర్ యూత్ సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తాతారావు, రవి, డీవీవీ ప్రసాద్, డి.దామోదరం, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

దేవరపల్లి, ఫిబ్రవరి 14: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. యర్నగూడెంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠలో భాగంగా బుధవారం నిర్వహించిన రాట ముహూర్తంలో ఆమె పాల్గొన్నారు. అలాగే యాదవోలు, దేవరపల్లి సదస్సుల్లో, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతోపాటు రాజమండ్రి పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాసరావుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైసీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.